

జగన్ పాలనలో ప్రధాన సంస్థలు రాష్ట్రాన్ని విడిచిపెట్టగా, కూటమి ప్రభుత్వం గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి దిగ్గజాలను ఆకర్షిస్తోంది. పెట్టుబడిదారుల విశ్వాసం పెంచుతూ, గత ఆర్థిక నష్టాల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 11.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 19 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# తెలంగాణ గడ్డపై మోదీ శంఖారావం

- తెలంగాణలో వచ్చే ప్రభుత్వం బీజేపీదే
- సికింద్రాబాద్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పార్టీ తొలిసారి అద్భుత విజయం సాధించిందని, తెలంగాణలోనూ బెంగాల్ పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామనే నమ్మకం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీ పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సుపరిపాలనతోనే దేశ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారు. అబ్ కీ బార్ తెలంగాణ మే బీజేపీ సర్కార్. అసోంలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతే. బెంగాల్ ప్రజలు టీఎంసీ, లెఫ్ట్ పార్టీలను తిరస్కరించారు. మమత నియంతృత్వాన్ని బెంగాల్ ప్రజలు ఎదిరించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ విస్తరిస్తోంది. కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలు కాదు.. విశ్వాస రాజకీయాలను ప్రజలు నమ్ముతున్నారు. పదేళ్ల క్రితం బెంగాల్‌లో ముగ్గురు ఎమ్మెల్యేలే ఉన్నారు. ఇప్పుడు 200 మందికి పైగా ఎమ్మెల్యేలు ఉన్నారు'.. 'ఒకప్పుడు బీజేపీకి రెండే ఎంపీ సీట్లు ఉండేవి. అందులో ఒకరు తెలంగాణ వ్యక్తి. తెలంగాణకు వేల కోట్ల నిధులు ఇస్తున్నాం. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనను తెలంగాణ ప్రజలు నమ్మడం లేదు. హైదరాబాద్‌ను అన్ని రకాలుగా కేంద్రం అభివృద్ధి చేస్తోంది' అని అన్నారు.

**కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది :** మోదీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా.. అబద్ధాలతోనే పాలన సాగిస్తోంది. హామీలతో ఆకాశానికి ఎత్తి తర్వాత మోసం చేస్తారు. కాంగ్రెస్ మావోయిస్టు పార్టీగా మారింది. ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్‌గా మారింది.

మిగతా 2లో...

## నమో నారా బంధం..
# తరగని అనుబంధం

- సీఎం చంద్రబాబు ఆత్మీయ ఆతిథ్యం స్వీకరించిన ప్రధాని నరేంద్ర మోదీ
- వెంకటగిరి జామ్దానీ నేతతో శ్రీవారి చిత్రాన్ని బహూకరించిన సీఎం కుటుంబం
- ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ వంటలతో ప్రధానికి తేనీటి విందు
- మంత్రి నారా లోకేష్‌ను ఆప్యాయంగా పలకరించిన ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రధానిని గురువుగా భావిస్తూ.. ఆయన మార్గదర్శకత్వంలో లోకేష్ అడుగులు
- గతంలోనూ నారా లోకేష్ పనితీరును ప్రశంసించిన ప్రధాని



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ గంటకు పైగా సమయాన్ని చంద్రబాబు కుటుంబానికి కేటాయించారు. బిజీ షెడ్యూల్లో కూడా ప్రధాని మోదీ సీఎం చంద్రబాబు కుటుంబానికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. నమో – నారా బంధానికి ఇదొక చక్కని ఉదాహరణ అనే భావన రాజకీయ వర్గాల్లో ఏర్పడుతోంది. టీడీపీ–బీజేపీలతో రాజకీయంగా మిత్ర బంధం ఉన్నప్పటికీ... ప్రధాని నరేంద్ర మోదీతో నారా ఫ్యామిలీకి కుటుంబ పరంగా కూడా అనుబంధం ఏర్పడింది. అందుకే ప్రధాని మోదీ తన హైదరాబాద్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్యామిలీతో గంటకు పైగా గడిపారు. నరేంద్ర మోదీ–చంద్రబాబు మధ్య రాజకీయంగా సాన్నిహిత్యం ఉన్నా... నారా లోకేష్ కారణంగా ఆ బంధం కుటుంబం బంధంగా మారిందనే చెప్పాలి. గతంలో నారా లోకేష్ ను కుటుంబంతో సహా ఢిల్లీలోని తన ఇంటికి ప్రధాని మోదీ ఆహ్వానించారు. గౌరవించారు. అప్పటి నుంచి వీరి మధ్య బంధం మరింత బలోపేతం అయింది... కుటుంబ బంధంగా మారింది.

**ప్రధాని నుంచి అరుదైన ఆహ్వానం :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభా వేదికపై 'నీకెన్ని సార్లు చెప్పాలి.. నన్ను కలవడానికి రావా?' అని ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించారు. ఈ అరుదైన ఆహ్వానానికి ఉబ్బితబ్బిబ్బు అయిన మంత్రి నారా లోకేష్.. 'త్వరలోనే కుటుంబ సమేతంగా ఢిల్లీకి వస్తాను' అని ప్రధానితో చెప్పారు.

మిగతా 2లో

# వదిలి పెట్టం...!

## బీజేపీ జిల్లా అధ్యక్షుడిపైనే చేయి చేసుకునే ధైర్యమా?

- కడప బిజెపి జిల్లా అధ్యక్షుడిపై చేయి చేసుకున్న డిఎస్పీ పై చర్యలు తీసుకోవాలి
- డీఎస్పీ అరాచక శక్తులకు అండగా నిలుస్తారా ?
- ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే పోలీసులు దాడులకు దిగుతారా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర ఆగ్రహం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కడప బిజెపి జిల్లా అధ్యక్షుడిపై చేయి చేసుకున్న డిఎస్పీపై డీజీపీ తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్పీని తక్షణం సస్పెండ్ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతూ ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో బైక్ ర్యాలీలు, శోభా యాత్రలు నిర్వహిస్తున్న సమయంలో కడపలో చోటుచేసుకున్న ఘటనలు విచారకరమని అన్నారు.

కడప నగరంలోని అల్మాస్పేట సెంటర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన తోరణాలు, జెండాలను తొలగిస్తూ కొందరు అరాచక శక్తులు దాడులకు దిగారని ఆరోపించారు.

2 లో..





# సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం

## అంబరాన్ని అంటిన సంబరాలు



**చెన్నై (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం అధినేత ప్రమాణ స్వీకారం చేయడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. రాష్ట్రవ్యాప్తంగా టీవీకే పార్టీ శ్రేణులు, విజయ్ అభిమానులు టపాసులు కాలుస్తూ, స్వీట్లు తినిపించుకుంటూ వేడుక చేసుకుంటున్నారు. చెన్నై, మదురై, తిరుచిరాపల్లి, తూత్తుకుడి సహా పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అందరూ కలిసి రోడ్లపైకి వచ్చి వేడుక చేసుకుంటున్నారు.

వీధులన్నీ తిరుగుతూ ప్రజలకు స్వీట్లు పంపిణీ చేస్తున్నారు. 70 ఏళ్ల తర్వాత డీఎంకే, అన్నాడీఎంకేయేతర పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, నేడు విజయ్‌తోపాటు 9 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. వీధులన్నీ తిరుగుతూ ప్రజలకు స్వీట్లు పంపిణీ చేస్తున్నారు. 70 ఏళ్ల తర్వాత డీఎంకే, అన్నాడీఎంకేయేతర పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, నేడు విజయ్‌తోపాటు 9 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది.

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జోసెఫ్ విజయ్,

మిగతా 2లో...

## టీటీడీ ఆధ్వర్యంలో గోసంరక్షణ ఉద్యమం....
# అదనపు ఈవో కీలక పిలుపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గోమాత సంరక్షణ భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సేవ అని, గోసంరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి కోరారు. టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, శ్రీనివాస సేవా ట్రస్ట్ ఛైర్మన్ టి. సత్యనారాయణ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ గోశాలకు ఆదివారం 180 లారీల ద్వారా సుమారు 1600 టన్నుల ఎండుగడ్డిని విరాళంగా అందజేశారు.

**సమాజానికి ఆదర్శం :** ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ, కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రాంతం నుండి ఎండుగడ్డిని సేకరించి, సొంత నిధులతో పాటు రవాణా ఖర్చులను భరిస్తూ ఇంత భారీ స్థాయిలో మొదటిసారిగా విరాళం అందించడం అభినందనీయమన్నారు. గోవుల పరిరక్షణ, పాడి ఉత్పత్తుల పెంపు కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శమన్నారు. పురాణాలలో గోవుకు విశిష్ట స్థానం ఉందని, గోసేవ సనాతన ధర్మమని పేర్కొన్నారు. తిరుపతి ఎస్వీ గోశాలకు అందిన ఎండుగడ్డిని టిటిడి పరిధిలోని తిరుపతి, తిరుమల, పలమనేరు, బాకారాపేట సమీపంలోని కమలయ్యగారిపల్లి గోశాలలకు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఈ గోశాలల్లో మొత్తం 2974 గోవులు, ఎద్దులు,

మిగతా 2లో...

# అసోం సీఎంగా హిమంత



- మే 12న ప్రమాణ స్వీకారం

**అసోం(జర్నలిస్ట్ ఫైల్) :** అసోం ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన హిమంతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తున్నట్లు ఆదివారం రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మార్గం సుగమమైంది. మే 12వ తేదీ ఉదయం 11:40 గంటలకు ఖానాపారాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో హిమంత ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చీఫ్ సెక్రటరీ పేర్కొన్నారు.

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ శాసనసభాపక్ష సమావేశంలో హిమంత బిశ్వ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన కూటమి భాగస్వామ్య పార్టీల నేతలతో కలిసి లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు.

మిగతా 2లో...

# అన్నవరప్పాడు క్షేత్రంలో అధ్యాత్మిక వైభవం

- రూ. 2 కోట్లతో అలయ పునరుద్ధరణ: శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్
- భక్తుల నమ్మకాలకు ప్రతిరూపాలు దేవాలయాలు
- దావరి పుష్కర నిధులతో వేగంగా సాగనున్న పనులు
- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడమే లక్ష్యం అన్న మంత్రి



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం అన్నవం-ప్పాడు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అలివేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ ఘట్టానికి అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఆదివారం అంకురార్పణ జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి వర్యులు కందుల దుర్గేష్ ఈ పుణ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి దుర్గేష్ కి దేవాలయ అధికారులు, వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ 'పూర్ణకుంభం'తో ఘనంగా స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది. మంత్రి దుర్గేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ. 2 కోట్ల గోదావరి పుష్కరాల నిధులతో రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హోమగుండం వద్ద జరిగిన ధార్మిక క్రతువులో పాల్గొన్న మంత్రి దుర్గేష్ పవిత్ర హోమగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణ ప్రణాళికను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు.

మిగతా 2లో...

# బీసీ హాస్టళ్లు బేష్

- ఐవీఆర్ఎస్ సర్వేలో టాప్ ప్లేస్
- సంక్షేమ హాస్టళ్లలో 78.20 శాతంతో అగ్ర స్థానంలో బీసీ హాస్టళ్లు
- విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణలో వెల్లడి
- కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల చదువుకు ప్రాధాన్యం
- అధికారంలోకి రాగానే గత ప్రభుత్వపు రూ.110 కోట్ల డైట్ బకాయిల చెల్లింపు
- నాటి నుంచి ఎప్పటికప్పుడు డైట్, కాస్మోటిక్ బిల్లుల మంజూరు
- విద్యార్థుల ఆరోగ్య, ఆహార భద్రతకు పెద్దపీట



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల విద్యకు ఆసరాగా నిలిచే హాస్టళ్లు మెరుగైన పనితీరుతో ముందంజలో నిలుస్తున్నాయి. మౌలిక సదుపాయల కల్పన, ఆరోగ్యకరమైన మెనూ, బోధనలతో రాష్ట్ర స్థాయిలో బీసీ హాస్టళ్లు అగ్రగామిగా నిలిచాయి. పరిశుభ్రమైన వాతావరణం, పరిశుద్ధమైన తాగునీటి కల్పన, ఆరోగ్యభద్రతతో కూడిన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల మనస్సును బీసీ హాస్టళ్లు గెలుచుకున్నాయి. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వ ఐవీఆర్ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ సంక్షేమ హాస్టళ్లు 78.02 శాతం సంతృప్త స్థాయిలతో ప్రథమ స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1110 బీసీ బాలురు, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి.

మిగతా 2లో...

# జగన్ హయాంలో ఆలయాలకు భద్రత కొరవడింది: మంత్రి ఆనం



**నెల్లూరు(జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం పురాతనమైన, పవిత్రమైన ఆలయమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో దేవాలయాలకు భద్రత కొరవడిందని.. విధ్వంసాలు సృష్టించారని ధ్వజమెత్తారు. ఆదివారం నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడారు.

వైసీపీ హయాంలో సనాతన ఆచార వ్యవహారాలను, ధర్మాలను అపహాస్యం చేశారని

మిగతా 2లో...

# ప్రజల వద్దకే పాలన.. సమస్యల పరిష్కారానికే 'మాటా-మంతీ



- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి
- ఏడాదిన్నరలో నేరేడు బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేస్తాం
- రూ.650 కోట్లతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం
- క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**కోటబొమ్మాళి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి, వారి సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కోటబొమ్మాళి మండల కేంద్రంలోని శివాలయం వద్ద శనివారం నిర్వహించిన "మాటా-మంతి" కార్యక్రమంలో మంత్రి పాల్గొని స్థానిక ప్రజలతో నేరుగా మమేకమయ్యారు.

ప్రజల దైనందిన ఇబ్బందులను, సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం ద్వారానే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

23 నెలల పాలనలో నూరు శాతం హామీల అమలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల అరాచక పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న వెనుకబాటుతనాన్ని వివరించిన ఆయన, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 23 నెలల వ్యవధిలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నూరు శాతం నెరవేర్చిన చిత్తశుద్ధి తమ ప్రభుత్వానిదేనని ఉద్ఘాటించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. పారిశ్రామిక ప్రగతి మరియు ఉద్యోగ కల్పన రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సుమారు రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పరిశ్రమలు ముందుకు వస్తున్నాయని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ పాలనలో పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెనుకంజ వేశాయని, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు మరియు లోకేష్ ల ప్రత్యేక చొరవతో పరిశ్రమలు క్యూ కడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, విద్యా మరియు ఉపాధి అవకాశాలకు విశాఖపట్నం కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందనుందని ఆయన వివరించారు.

**కోటబొమ్మాళి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ..నేరేడు బ్యారేజ్ నిర్మాణం :** స్థానిక నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి మాట్లాడుతూ.. గడిచిన 23 నెలల్లో కోటబొమ్మాళి గ్రామ అభివృద్ధికి రూ. 7 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. మండల పరిధిలో 10 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో పాటు, రూ. 54 లక్షల వ్యయంతో తహసీల్దార్ కార్యాలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఏడాదిన్నరలోగా నేరేడు బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, ఈ విషయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**జిల్లాలో పరిశ్రమ స్థాపనకు ప్రత్యేక కృషి:** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక కృషి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఏడాదిన్నరలు నేరేడు బ్యారేజ్ పూర్తి చేస్తాం :** నేరేడు బ్యారేజ్ సాధనలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక పాత్ర పోషించారని, జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులందరికీ ఈ ఘనత దక్కుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఏడాదిన్నరలో న్యారేడ్ బ్యారేజ్ పూర్తి చేస్తామని వెల్లడించారు.

కార్యక్రమంలో ఆర్డీఓ ఎమ్. కృష్ణ మూర్తి, కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, తాసిల్దార్ ఎస్. వి. ప్రసాద రావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# నమో నారా భేటీలో నవ్వుల సందడి







- ప్రధాని మోదీ చేసిన సాయానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- ఇకపై బరువు తగ్గొద్దంటూ మంత్రి లోకేష్ కు ప్రధాని మోదీ సలహా
- మీరే స్ఫూర్తిగా పూర్తి ఫిట్నెస్ సాధిస్తానన్న మంత్రి లోకేష్
- పీఎం, ఏపీ సీఎం తేనీటి విందులో సరదా సంభాషణలు, ఆసక్తికర చర్చలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఒకరు దేశానికి ప్రధాన మంత్రి.. మరొకరు సీనియర్ ముఖ్యమంత్రి.. ఇద్దరూ రాజకీయాల్లో మేరు నగధీరులు... గంభీరంగా ఉంటారు. నిత్యం అభివృద్ధి-సంక్షేమం, దేశం-రాష్ట్రం గురించే వీరి ఆలోచన, తపన. క్షణం తీరికలేని పర్యటనల్లో ఉంటారు. తొలిసారిగా వీరిద్దరూ మధ్య సరదా సంభాషణలతో సమావేశం జరిగింది. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ఇంటికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ గంటకుపైగా సమయాన్ని చంద్రబాబు నివాసంలో గడిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసాంతం నవ్వులు విరిశాయి. సీఎం చంద్రబాబు నివాసంలోకి అడుగు పెడుతుండగానే... ఓ ఫొటో చూసిన ప్రధాని ఏడాది క్రితం అనుభవాలు గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సరిగ్గా ఏడాది క్రితం యువగళం కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ ఢిల్లీలో చేయించారు మంత్రి నారా లోకేష్. అప్పటి ఫోటోను ఫ్రేమ్ చేయించి.. అందులో యువగళం కాఫీ టేబుల్ బుక్ కూడా భద్రపరిచారు. ఇది సీఎం చంద్రబాబు ఇంట్లోకి వెళ్లే ముందు కనిపిస్తుంది. ప్రధాని మోదీ ఆ ఫోటోను చూసి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ పుస్తకాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించి ఏడాది పూర్తైందని... యాధృచ్ఛికంగా ప్రధాని తమ ఇంటికి వచ్చారంటూ ప్రధాని మోదీకి నాటి సంఘటనలను లోకేష్ గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబు ఇంటిలోని రామమందిరం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలు దశాబ్దాల క్రితం నాటివని... ఆ పంచలోహ విగ్రహాలను నందమూరి తారకరామారావు గారు తమకు ఇచ్చారని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి వివరించారు.

**అన్నింటిలోనూ ప్రధానే ఆదర్శం... :** చంద్రబాబు నివాసంలో ప్రధానితో సమావేశం సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న సాయానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఈ సమావేశంలో లోకేష్ ఫిట్నెస్ పై ఆసక్తికర సంభాషణ జరిగింది. లోకేష్ ఇలా స్లిమ్‌గా, ఫిట్‌గా మారడానికి ప్రధాని మోదీనే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు. తొలిసారి ప్రధానితో భేటీ అనంతరం లోకేష్ ఫిట్నెస్, డైట్ పై శ్రద్ధ పెట్టారని సీఎం చంద్రబాబు ప్రధానికి చెప్పారు. లోకేష్ ఇంకా బరువు తగ్గొద్దంటూ మోదీ సలహా ఇచ్చారు. ఫిట్నెస్ విషయంలో మీరే స్ఫూర్తి అని... మరింత ఫిట్ గా మారతానని లోకేష్ ప్రధానితో చెప్పారు. దేశం కోసం క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నారని, 75 ఏళ్ల వయస్సులో ప్రధాని పాటించే ఆరోగ్య సూత్రాలు, శారీరక ధృడత్వం వంటివి తనకు స్ఫూర్తి అని మంత్రి లోకేష్ ప్రధానితో చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పని విధానం చూస్తుంటే... 25 ఏళ్ల వయస్సున్న ముగ్గురు యువకులు ప్రధానిలో ఉన్నట్టు చురుగ్గా పని చేస్తారని ఈ సందర్భంగా లోకేష్ అన్నారు.

**నాకు ఇద్దరు మెంటార్లు.. :** ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ తనకు మెంటార్లే ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాజకీయాల్లోనూ, అభివృద్ధిలోనూ, ప్రజా సంక్షేమంలోనూ దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు తనకు మార్గదర్శకులని... ఇద్దరూ తనకు మెంటార్లేనని, గురువులుగా వారిని అనుసరిస్తానని లోకేష్ అన్నారు. అంకితభావంతో, సేవా ధృక్పధంతో భావితరాల కోసం నిస్వార్థంగా పని చేసే మోదీ, చంద్రబాబుల స్పీడ్ అందుకోవాలనే తన కల సాకారం కావాలని కోరుకుంటున్నా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఎప్పుడు కలిసినా తన నియోజకవర్గం మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించడం నారా లోకేష్ ఆనవాయితీగా పెట్టుకున్నారు. మంగళగిరి చేనేత శాలువాతో ప్రధానిని సత్కరించి లోకేష్.. మంగళగిరి చేనేత విశిష్టతను ప్రధానికి వివరించారు.

# బీసీ హాస్టళ్లు బేష్

(మొదటి పేజీ తరువాయి)

నిధులు విడుదల చేయకపోవడంతో మరమ్మతులు సైతం నోచుకోలేకపోయాయి. కనీసం డైట్ బిల్లు కూడా చెల్లించకపోవడంతో బీసీ బిడ్డలు అర్ధాకలితో నరకం చూశారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించిన పాపానపోలేదు. దినదిన గండంగా ఆ అయిదేళ్లు బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు కాలం నెట్టుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇతర సంక్షేమ హాస్టళ్లతో పాటు బీసీ సంక్షేమ హాస్టళ్లకు మంచిరోజులు ప్రారంభమయ్యాయి. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా బీసీ బిడ్డల ఆకలి తీర్చేలా రూ.110 కోట్ల మేర డైట్ బకాయిలను చెల్లించారు. నాటి నుంచి ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలను సైతం విద్యార్థులకు సకాలంలో చెల్లిస్తున్నారు. 23 నెలల కాలంలో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, ఇతర నిర్మాణాల కోసం రూ.100 కోట్లు వెచ్చించారు. రూ.2 కోట్లతో 104 హాస్టళ్లలో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అందజేయడానికి ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో బీసీ బిడ్డలు 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

**విద్యార్థుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట :** విద్యతోనే బీసీలను అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించగలరన్నది సీఎం చంద్రబాబు ఉద్దేశం. అందుకే బీసీ బిడ్డల విద్యకు, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా 971కి పైగా మరుగుదొడ్ల నిర్మాణం విస్తృతంగా చేపట్టారు. ఇప్పటికే కొన్ని హాస్టళ్లలో నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్నింటిలో మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయనున్నారు. అన్ని హాస్టళ్లలో పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి రూ.21 కోట్లతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దోమల నివారణే లక్ష్యంగా రూ.6 కోట్లు వెచ్చించి, అన్ని హాస్టళ్లలోనూ తలుపులకు, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేశారు. హాస్టళ్లలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా రూ.20 కోట్లతో ఇన్వర్టర్లను ఏర్పాటు చేసింది. వంట పాత్రలు, ఇతర సామాగ్రి కోసం రూ.18 కోట్లు అందజేసింది. పౌష్టికాహారం అమలులో భాగంగా హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు కోసం కుక్ లు, కమాటీలను ప్రభుత్వం ఇప్పటికే నియమించింది. హాస్టళ్లలో పరిశుభ్రత కోసం 1,291 పారిశుధ్య సిబ్బందిని త్వరలో నియమించడానికి చర్యలు చేపట్టింది. బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం.

**ఎఫ్ఆర్ఎస్ తో రూ.6 కోట్ల ఆదా :** బీసీ హాస్టళ్లలో నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట వేయసాగారు. విద్యార్థుల హాజరులో ఆరోపణలకు తావులేకుండా ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్)ను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా హాస్టల్ సిబ్బందికి సైతం ఎఫ్ఆర్ఎస్ ను అమలు చేశారు. ఈ వ్యవస్థను అమలు చేయడంతో విద్యార్థుల హాజరు మెరుగవ్వడమే కాకుండా విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించ సాగారు. అన్నింటికంటే ముఖ్యంగా విద్యార్థుల మెనూకు అవసరమయ్యే నిత్యావసర సరుకుల దుర్వినియోగానికి అడ్డుకట్టపడింది. దీనివల్ల నెలకు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ, ఏడాదికి రూ.6 కోట్లకు పైబడి ఆదా అయ్యింది. ఎఫ్ఆర్ఎస్ విధానం మొట్టమొదటిసారిగా బీసీ హాస్టళ్లలో అమలు చేయడం విశేషం. హాస్టల్ సిబ్బందికి కేవలం ఆదేశాలతోనే సరిపెట్టకుండా, విధి నిర్వహణలో పారదర్శకత, పర్యవేక్షణ కోసం హెచ్.పి.టి.ఎస్. యాప్ ను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోల పనితీరును ఈ యాప్ ద్వారా మరింత మెరుగుపరచడానికి వీలుకలిగింది. హాస్టళ్లలో మెనూ అమలు, పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీటి కల్పనపై ఏ రోజుకారోజు ఫొటోలను ఈ యాప్ లో అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల హాస్టళ్లలో పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం రాష్ట్ర స్థాయి అధికారులకు కలిగింది.



**ఐవీఆర్ఎస్ సర్వేలో బీసీ హాస్టళ్లు టాప్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీ హాస్టళ్ల ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించించి. రూ.వందల కోట్లు వెచ్చిస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వసతి అందిస్తోంది. నిధులు విడుదలతోనే చేతులు దులుపుకోకుండా, అంతిమంగా విద్యార్థులకు ఫలాలు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టంది. ఈ సర్వేలో భాగంగా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి, బీసీ హాస్టళ్ల పనితీరుపై ఆరా తీయసాగింది. ఈ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్ల కంటే బీసీ హాస్టళ్ల నిర్వహణ భేషుగ్గా ఉన్నట్లు వెల్లడైంది. 2025-26 విద్యా సంవత్సరంలో రెండు పర్యాయాలు ఐవీఆర్ సర్వే ద్వారా ప్రభుత్వం తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించింది. గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 26 వరకూ మొదట విడతగా, ఈ ఏడాది మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకూ రెండో విడతగా ఐవీఆర్ఎస్ సర్వేగా తల్లిదండ్రులు అభిప్రాయాలు తీసుకుంది. హాస్టల్ నిర్వహణా తీరు ఎలాగుంది... వార్డెన్ల పనితీరు... మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా..? అని మూడు ప్రశ్నలకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమాధానం రాబట్టారు. మొదటి విడత సర్వేలో 71.30 శాతం. రెండో విడతలో 78.20 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేశారు. మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ హాస్టళ్ల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులిచ్చిన సంతృప్త స్థాయి అధికంగా ఉండడం విశేషం.

**మంత్రి సవిత నిరంతర పర్యవేక్షణతో సత్ఫలితాలు :** గత ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లకు నిధులు మంజూరు చేయకపోవడమే కాకుండా పర్యవేక్షణకు సైతం నోచుకోలేకపోయాయి. జగన్ ప్రభుత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రులు హాస్టళ్లను సందర్శించిన పాపానపోలేదు. మొక్కుబడిగా అయిదేళ్ల కేవలంలో ఒకట్రెండు హాస్టళ్లను సందర్శించి మమ అనిపించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడం, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎస్.సవితకు సీఎం చంద్రబాబు నాయుడు బాధ్యతలు అప్పగించడంతో బీసీ హాస్టళ్ల దశ తిరిగింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లను మంత్రి సవిత సందర్శిస్తూ వస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తూ, నేరుగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని, అక్కడికక్కడే వాటికి పరిష్కారం చూపుతూ వస్తున్నారు. డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలతో తరుచూ సమీక్షా సమావేశాలు నిర్వహించి, మెనూ అమలు, హాస్టళ్ల అభివృద్ధి, విద్యార్థులను పరీక్షలకు సన్నదద్ధతపై దిశానిర్దేశం చేయసాగారు. అటు కూటమి ప్రభుత్వం, ఇటు మంత్రి సవిత నిరంత పర్యవేక్షణతో టెన్త్, ఇంటర్ లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు అత్యుత్తమ పలితాలు సాధించారు.

## కీలక పరిణామాల వేళ ఢిల్లీకి చంద్రబాబు.!



- పోలవరం ప్రాజెక్టు పనులు, నిధుల విడుదలపై సంప్రదింపులు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో.(జర్నలిస్ట్ ఫైల్) :**

ఏపీలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటోంది. ఇక పాలన.. ప్రభుత్వ పరంగా మార్పులకు కూటమి ముఖ్య నేతలు సమాయత్తం అవుతున్నారు.

ఇటు ప్రధాని హైదరాబాద్ పర్యటనలో ప్రత్యేకంగా చంద్రబాబు.. పవన్ నివాసాలకు వెళ్లారు. ఈ సమయంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో భేటీ కానున్నారు. తాజా పరిణామాల పైన చర్చించనున్నారు. అదే విధంగా ఇతర మంత్రులతోనూ చంద్రబాబు సమావేశం అవుతున్న వేళ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారైంది. ప్రభుత్వ వ్యవహారాలతో పాటుగా రాజకీయ కీలక అంశాల పైన కేంద్రంలోని ముఖ్యులతో చర్చించనున్నారు. త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ దిశ గా చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రేపు ఉదయం 11:30 గంటలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో చంద్రబాబు భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమై పోలవరం ప్రాజెక్టు పనులు, నిధుల విడుదలపై చర్చించనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, విభజన హామీల అమలుపై కేంద్ర పెద్దలతో సీఎం సంప్రదింపులు జరపనున్నారు. అదే విధంగా మధ్యాహ్నం 3 గంటలకు ప్రపంచ బ్యాంకు ప్రతి నిధులు ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన రుణ సాయం, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

చంద్రబాబు, పవన్ నివాసాలకు మోదీ- చిరంజీవికి పిలుపు..అనూహ్య నిర్ణయం..!!

**ఢిల్లీ పర్యటనలో కీలక నిర్ణయాలు**

కాగా, సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్‌లో జరిగే భారత పరిశ్రమల సమాఖ్య బిజినెస్ సమ్మిట్కు ముఖ్యమంత్రి హాజరవుతారు. ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పారిశ్రామికవేత్తలతో ఆయన మాట్లాడనున్నారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ సహా నీతి ఆయోగ్ సభ్యులతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి ప్రణాళికలపై చర్చించనున్నారు. రేపు రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న చంద్రబాబు.. మరుసటి రోజు కూడా మరికొంతమంది కేంద్ర మంత్రులు, ప్రముఖులతో భేటీ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే.. ఈ పర్యటనలో రాజకీయ అంశాల పైన జరిగే చర్చల్లో కీలక నిర్ణయాలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

# వాణిజ్య పన్నుల శాఖకు వెన్నంటే ఉంటాం.. సమస్యల పరిష్కారానికి కృషి

- వేతన సవరణ కమిషన్ నియామకానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం
- 13 లక్షల మంది ఉద్యోగుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నాం
- ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు ఎ.విద్యాసాగర్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీజీవో సంఘం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన, సంక్షేమ పరిరక్షణ కోసం ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లుతూ నిరంతరం కృషిచేస్తున్నామని తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం సాధించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్ బాబు అధ్యక్షతన ఆదివారం నగరంలోని గాంధీనగర్ ఏపీ ఎన్జీవో హోం లో జరిగింది. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల వివిధ డిమాండ్లపై చర్చ జరిగింది.

రీజనల్ కార్యాలయాలు, ఇతర డివిజన్లలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లను తిరిగి వారి సొంత డివిజన్లకు బదిలీ చేయడం, తాత్కాలికంగా ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించడం, పెండింగ్‌లో ఉన్న అన్ని పదోన్నతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయడం, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఖాళీలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఆడ్-హాక్ పదోన్నతులు కల్పించడం, గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఆఫీసర్లకు స్క్రూటినీ ఆఫ్ రిటర్న్ల కేటాయించి, ప్రోపర్ ఆఫీసర్ గా గుర్తింపు ఇవ్వడం తదితర డిమాండ్లపై చర్చించారు.

ఇటీవల వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్ నుండి +ుూ వరకు 100కి పైగా పదోన్నతులు కల్పించినందుకు చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్స్‌కు జూనియర్ అసిస్టెంట్ పదోన్నతులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాలో ఇవ్వడానికి చీఫ్ కమిషనర్ గారు సానుకూలంగా స్పందించి, అర్హుల వివరాలు పంపాలని జేసీలను కోరడాన్ని సంఘం స్వాగతించింది. పరిపాలనాపరమైన అనేక మార్పులు తీసుకువస్తూ, ఇంటెలి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నుండి జాయింట్ కమిషనర్ల వరకు కూర్చున్న చోటుకే బదిలీ ఉత్తర్వులు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

లిసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ..

వేతన సవరణ కమిషన్ నియామకానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని, ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు ప్రయత్నం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సంఘం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. జేఏసీతో సమన్వయంగా పనిచేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ విషయంలో ఏపీ ఎన్జీవో సంఘం ఎప్పటికీ రాజీ పడదని ఆయన పేర్కొన్నారు.

భవనారి వెంకటేశ్ బాబు, ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్ రావు సమర్థవంతంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అభినందించారు. 26 జిల్లాలలో ఏపీ ఎన్జీవోస్ సంఘం, జేఏసీలలో వాణిజ్య శాఖ ఉద్యోగులకు సభ్యులకు వివిధ పదవులు కేటాయించినట్లు తెలిపారు.

ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను సరైన రీతిలో, సరైన సమయంలో ఉన్నతాధికారులకు నివేదిస్తూ సంఘాన్ని ముందుకు నడిపిస్తున్నందుకు సంఘ నేతలను అభినందిస్తున్నట్లు తెలిపారు. లిభవనారి వెంకటేష్ బాబు మాట్లాడుతూలి వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో సమస్య పరిష్కారమవుతూ వస్తోందని తెలిపారు.

సమావేశంలో కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్ రావు, 15 డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు పరీక్షలతో క్షయకి అడ్డుకట్ట



**-:కుమ్మరిపల్లిలో కార్మికులకు వైద్య శిబిరం**

**రాయికల్, మే 10 (జర్నలిస్ట్ ఫైల్) :** క్షయ వ్యాధిని ముందస్తు నిర్ధారణ పరీక్షల ద్వారానే నివారించవచ్చని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ అన్నారు. రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలోని ఇటుక బట్టీ, కోళ్ల ఫాంలో పనిచేసే కార్మికులకు శనివారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి లేకపోవడం, దీర్ఘకాలిక దగ్గు, బరువు తగ్గడం, రాత్రివేళ జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు, మందులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఇల్లెందుల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కడకుంట్ల భూమయ్య, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలియా నాయక్ తండాలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం ఆలియా నాయక్ తండా గ్రామానికి చెందిన లావుడ్యా కైక తార్య నాయక్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై నూతన గృహాన్ని ప్రారంభించి కుటుంబ సభ్యులకు చీర కానుక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు సొంతింటి కలను సాకారం చేస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతికుటుంబానికి చేరవేయడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సంతోష్, ఉప సర్పంచ్ గణేష్, ఎంపీఓ సుష్మ, ఆత్మచైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, మాజీ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి సురేందర్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు, కోల శ్రీనివాస్, ఎంఏ ముఖీద్, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్స్‌కు అల్లీపూర్ విద్యార్థుల ఎంపిక



**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-16 విభాగంలో శ్రీహర్షవర్ధన్ లాంగ్ జంప్‌లో, బి. రిషి కుమార్, టి. నవదీప్ జావెలిన్ త్రోలో అర్హత సాధించారు. అండర్-18 విభాగంలో డి. విశ్వేష్ లాంగ్ జంప్‌లో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్ కుమార్, పీడీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వీరు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై సర్పంచ్ ఎంబారీ గౌతమి వెంకటేష్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తే మట్టెల పంపిణీ



**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన రానవేణి సత్యనారాయణ - రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె స్నేహాకు కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తే మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సూపర్‌వైజర్ భారతపు రాజేష్, అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి గంగరాజం, రవీందర్, చంద్రయ్య, అంజి తదితరులు హాజరయ్యారు.

## అల్లిపూర్‌లో వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం





**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా తొలి తాజా మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ నాయకులతో కలిసి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ రాజలింగం, బీఆర్ఎస్ నాయకులు బర్కాం మల్లేష్, రత్నాకర్ రావు, అన్నదాన ట్రస్ట్ అధ్యక్షులు మండ రవి, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేష్, ముదాం శ్రీను, ఎంబరి రాజారెడ్డి, అత్తినేని సాయిరెడ్డి, ఎంబరి కమలాకర్, నాయిని గంగారెడ్డి, పోతు శ్రీను, ఎంబరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదే సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి కూడా వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి స్వామివారి కళ్యాణోత్సవాన్ని భక్తి భావంతో వీక్షించారు.

## స్వీయ గణనపై అవగాహన వాకథాన్



**సైబరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** జనగణన కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన ప్రాముఖ్యతపై పౌరులకు అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని కోకపేటలో శనివారం వాకథాన్ నిర్వహించారు. శేరిలింగంపల్లి జోన్ నార్సింగి సర్కిల్-45 పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఉప కమిషనర్ కృష్ణ మోహన్ పాల్గొని స్థానిక నివాసితులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పౌరులు ఇంటి వద్ద నుండే మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా వివరాలు నమోదు చేసే సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, దీనివల్ల గణకుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా సమయం ఆదా అవుతుందని వివరించారు. ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేయడం వల్ల దోషాలు తగ్గి ఖచ్చితమైన సమాచారం సేకరించవచ్చని, ఇది జాతీయ అభివృద్ధికి, సంక్షేమ పథకాల ప్రణాళికకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ ప్రక్రియలో పాల్గొని సహకరించాలని కోరగా, స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది.

# అభివృద్ధికి సహకరించండి..



**-రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా బైపాస్ రోడ్డు..**

**-12.1 కిలోమీటర్ల దూరంతో 82 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం..**

**-అందరం కలిసి అభివృద్ధికి అడుగులు వేద్దాం..**

**-గతంలో ఎన్నడూలేని విధంగా పెద్దపల్లి అభివృద్ధి..**

**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..**

**పెద్దపల్లి, మే 10 (జర్నలిస్ట్ ఫైల్) :** పెద్దపల్లి మండలం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రూ. 82 కోట్లతో నూతనంగా నిర్మించే బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థానిక నాయకులతో మరియు అధికారులతో కలిసి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి సహకరించాలని పార్టీలకు అతీతంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి మద్దతు ఇవ్వాలని కోరారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పెద్దపల్లి నియోజకవర్గానికి రూ. 82 కోట్లతో బైపాస్ రోడ్డు మంజూరు చేయడం శుభ సూచకం అని పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రకాల అభివృద్ధి గౌరవ మంత్రుల సహకారంతో చేయడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి లో ఎన్నడు లేని విధంగా బస్సు డిపో, జిల్లా కోర్టు భవనం, డబల్ లైన్ రోడ్ల నిర్మాణాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, మినీ ట్యాంక్ బండ్ల నిర్మాణాలు, బ్యాడ్మింటన్ కోర్టులు, నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్లు, మండలాల నుండి జిల్లా కేంద్రానికి రోడ్డు మార్గాన్ని సులభతరం చేసే దిశగా డబల్ రోడ్డులు, దేవాలయాల అభివృద్ధి మరియు అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని సుల్తానాబాద్ మరియు పెద్దపల్లి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అలాగే అమృత్ పథకం ద్వారా మంచి నీటి ట్యాంకులను నిర్మిస్తూ ప్రజల అవసరాలను తీస్తున్నామని గుర్తు చేశారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల నుండి నిట్టూరు, చందపల్లి మీదుగా అప్పన్నపేట వరకు 12 కిలో మీటర్ల మేరకు డబల్ లైన్ రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ తో కూడిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈరోజు పనులు ప్రారంభించుకోవడం ఆనందదాయకం అని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రజలందరూ సహకరిస్తూ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు, స్థానిక సర్పంచు, గ్రామ పాలకవర్గం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు. డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజల ఆదరణ పెరుగుతోంది





**-విజయవాడలో విక్రయ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి వంగలపూడి అనిత**

**-రైతులతో మాట్లాడి పంటల వివరాలపై ఆరా**

**-రసాయన రహిత ఆహారంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి**

**-ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**విజయవాడ, మే 10 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలోని ఎస్ఎల్వీ గ్రీన్ మెడోస్ వద్ద వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల గురించి రైతులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రజల్లో ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన గణనీయంగా పెరుగుతుండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. రసాయనాలు లేని స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఆరోగ్యంపై చైతన్యం పెరుగుతున్న నేపథ్యంలో సహజ పద్ధతుల్లో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఏర్పడుతోందన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు కూడా లాభదాయకమవుతోందని మంత్రి అభిప్రాయపడ్డారు. తక్కువ వ్యయంతో సాగు చేయడంతో పాటు నేల సారాన్ని కాపాడటంలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగడంలో ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని చెప్పారు. రైతులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకోవడంతో సహజ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం పెరుగుతోందని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు. రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## బీసీల అభ్యున్నతికి కులగణనే కీలకం



**-వీహెచ్ దీక్షకు జగదీశ్వర్ గౌడ్ సంఘీభావం**

**శేరిలింగంపల్లి(జర్నలిస్ట్ ఫైల్)** బీసీల అభ్యున్నతికి కులగణన అత్యవసరమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. జనగణనలో కులాల వారీగా లెక్కలు తేల్చి బీసీలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో శనివారం అంబర్‌పేటలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు చేపట్టిన దీక్షకు శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేయడానికి కులగణన ఒక్కటే మార్గమని, దీని ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతాయని అన్నారు. బీసీల హక్కుల పరిరక్షణకు ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కులగణనపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తగిన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధనలో ఈ నిరాహార దీక్ష కీలక దశ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్, బ్లాక్ అధ్యక్షులు, ఇన్చార్జులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మైనారిటీ, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో అంగన్వాడీ లబ్ధిదారులకు పోషకాహార సరుకుల పంపిణీ



**రాయికల్, (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం వడ్డెర కాలనీ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు పోషకాహార సరుకులను పంపిణీ చేశారు. వేసవి సెలవుల సందర్భంగా లబ్ధిదారుల పిల్లలకు బరువులు, ఎత్తులు కొలిచి తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం 25 రోజుల పాటు వినియోగించుకునే విధంగా బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు, బాలామృతం, బాలామృతం ప్లస్, మురుకులు వంటి సరుకులను ఇంటికి అందజేశారు. అలాగే ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిల్లలు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్కువసార్లు నీరు, పానీయాలు, కొబ్బరి నీళ్లుతీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బియ్యని సుజాత, వార్డు సభ్యురాలు మాధురి, ఆయమ్మ లక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో వివాహ వార్షికోత్సవం



**శేరిలింగంపల్లి(జర్నలిస్ట్ ఫైల్)** మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్పర్సన్ రాగం సుజాత యాదవ్, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుమారులు, యువజన నాయకులు రాగం అనిరుద్ యాదవ్, రాగం అభిషేక్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం మియాపూర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వివేకానంద సేవ సంఘం వృద్ధుల, అనాథ బాలికల ఆశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులు రాగం దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల బాటలో నడుస్తూ సేవా పథంలో సాగుతున్న కుమారులను ఆశ్రమ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, మహేందర్ సింగ్, కిరణ్ యాదవ్, రాజు, భరత్ గౌడ్, రేవంత్, సలీం, వినయ్, రఘు, హరీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**-గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ప్రత్యేక వాహన తనిఖీలు**

**రామ్ మందిర్ ఏరియా, మే 10 (జర్నలిస్ట్ ఫైల్)** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫైవ్ ఇంక్లైన్, రమేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు, ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు.

# ఖమ్మం జిల్లాలో మరింత అసంతృప్తితో యాదవులు

**- ఈ విషయమై ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రుల్ని కలుస్తాం - అవసరమైతే ఆందోళన కార్యక్రమం చేపడతాం - విలేకరుల సమావేశంలో అఖిలభారత యాదవ మహాసభ నేతలు**




ఖమ్మం, మే 10 (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడిన ఖమ్మం జిల్లా యాదవులకు నామినేటెడ్ పదవుల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ విషయంపై ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తామని, అవసరమైతే ఆందోళన కార్యక్రమం చేపట్టి, యాదవుల సత్తా ఏమిటో చూపిస్తామని, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా, రాష్ట్ర నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు నియామకం జరిగిన తర్వాత బీసీ వర్గాలలో ముఖ్యంగా యాదవులలో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు అనేది నిజం. శనివారం ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, రాష్ట్ర ఉద్యోగుల విభాగం సంఘం నాయకులు దుబాకుల శ్రీనివాస్ లు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బిసి కులాలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు రాజకీయ పదవుల విషయంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వం హయాంలో కనీసం ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ ఎంపీ, రెండు ఎమ్మెల్సీలు ఒక మంత్రి పదవి, కార్పొరేషన్ చైర్మన్లు డిసిసిబి చైర్మన్ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉండి పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన యాదవులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం జరిగిందని, ఇప్పటివరకు యాదవులకు ఖమ్మం జిల్లా నుండి రాష్ట్రస్థాయి నామినేట్ పదవిని ఇవ్వలేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వమైనా కేటాయిస్తారని ఆశించామని, కానీ అంతా ఒకే తాను కు చెందిన ముక్కలనిఅర్థమైందని ,ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన వ్యక్తి, 30 సంవత్సరములకు పైగా రాజకీయాల్లో ఉండి, యాదవులకొరకు , గొర్రెల సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ 2023 లో జరిగిన ఎన్నికల లో జిల్లా మొత్తం పర్యటించి యాదవుల ప్రజా సమావేశాలు నిర్వహించి, యాదవులను కాంగ్రెస్ పార్టీ వైపు మళ్ళించటానికి ఎంతో ప్రయత్నం చేశారని, ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు 57 రోజులు జైలు జీవితం కూడా గడిపారని,ఆర్థికంగా, మానసికంగా, కుటుంబ పరంగా ఎంతో నష్ట పోవడం జరిగిందని ఈ విషయం జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రులకు తెలుసని పేర్కొన్నారు. మా యాదవులకు ఇలాంటి అన్యాయం జరిగితే సహించబోమని, కేవలం రాజకీయ స్వార్థం కోసం, ఓట్ల కోసం మల్లి బాబు యాదవ్ ను, యాదవ సంఘం నాయకులను ఉపయోగించుకున్నారని, ఈ విషయమై ముగ్గురు మంత్రులను కలిసి విన్నవిస్తామని, అవసరమైతే జిల్లాలోని యాదవులంతా ఏకమయ్యి ఆందోళన కార్యక్రమం కూడా చేపడతామని హెచ్చరించారు. వీళ్ళు గొర్రెలు కాచుకునే వాళ్లు కదా, అని చులకనగా చూడవద్దని , సాధ్యమైనంత త్వరలో ఈ సమస్య ను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షురాలు కనక బండి విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మోరిమేకల కోటయ్య, సత్తి వెంకన్న, తెల్లబోయిన రమణ, తోడేటి లింగరాజు, పొదిల భూపతి, వాకదాని వల రాజు, రాగం బాబురావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దోతి సెర్మనీ అండ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు



మే 10 (జర్నలిస్ట్ ఫైల్) సంగారెడ్డి ప్రతినిధి:సదాశివపేట పట్టణంలోని హోటల్ 9 ఫంక్షన్ హాల్లో నిర్వహించిన డాక్టర్ భువనేశ్వరి పంచాల్ దంపతుల కుమారులు సుమేద్ పంచాల్, సుమన్ పంచాల్‌ల దోతి సెర్మనీ మరియు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పంచుకుని కార్యక్రమం విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్, రియాజ్, అనిల్ రాగం, గుణాకర్, అఖిల్, సోమ శంకర్ తదితరులు పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు.

# పసుమర్తి రామ్మోహనరావు కు ఘన సన్మానం

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : 36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు కార్పొరేటర్ గా ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సన్మాన కార్యక్రమం శనివారం వసంత బాబు వారి మిత్ర బృందం చే షీల్డ్ ప్రధానం చేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గడిచిన ఐదు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి గురించి వారు కొనియాడారు. రాబోయే రోజుల్లో రాజకీయంగా మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని అదేవిధంగా రాబోయే కాలంలో జరగబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆశీస్సులతో, డివిజన్ ప్రజల ఆశీస్సులతో మరోసారి కార్పొరేటర్ గా గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు గౌరోజు వసంత బాబు, ఉరిమెళ్ళ రామకృష్ణ, నాగాండ్ల ఆనంద్ బాబు, అరసవిల్లి అబ్బులు,రానేరు వెంకటేశ్వర్లు, కోటగిరి నాగేశ్వరరావు, ర్యాలీ బ్రహ్మజీ, మహేశ్వరం సుబ్రహ్మణ్యం ,దర్శి వెంకట్, ఆలేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు ఆకాంక్ష-నిఖిల్ రెడ్డిలకు తన ఆశీస్సులు అందజేశారు.ఉంద్యాల హన్మంతరెడ్డి-వసంత దంపతుల ఏకైక కుమార్తె ఆకాంక్ష పెళ్లి లొంకల్ పల్లి వాస్తవ్యులు లింగరెడ్డిగారి శ్రీధర్ రెడ్డి-రజిత దంపతుల ఏకైక కుమారుడు నిఖిల్ రెడ్డితో శనివారం ఘనంగా జరిగింది.హైదరాబాద్ శంషాబాద్ మైఫేర్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ పెళ్లికి ఎంపీ రవిచంద్ర హాజరై అక్షింతలు వేసి నూతన వధూవరులు ఆకాంక్ష-నిఖిల్ రెడ్డిలను ఆశీర్వదించారు, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# సామ్ ట్రస్ట్ చారిటీ మరియు వెల్ఫేర్ జాతీయ అవార్డు కార్యక్రమము




మే 10 (జర్నలిస్ట్ ఫైల్) సంగారెడ్డి ప్రతినిధి: సదాశివపేట పట్టణంలో ఈరోజు 9 5 2026 నాడు ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ యందు సామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక సామాజిక కార్యక్రమం నిర్వహించారు సామ్ ట్రస్ట్ చైర్మన్ షేక్ అంజుమ్ ఆధ్వర్యంలో చింత ప్రభాకర్ శాసనసభ్యులు సంగారెడ్డి చేతులమీదుగా అవార్డు పంపిణీ చేయడం జరిగింది మెహందీ డిజైన్ విజేతలు మరియు టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు కుట్టు మిషన్ పంపిణీ చేయడం జరిగింది అదే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సాధించిన విద్యార్థులకు కూడా సన్మానించడం నగదు బహుమతులు అందించడం జరిగింది. సామ్ ట్రస్ట్ సదాశివపేట వాళ్లు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా అభినందనీయం అని చింత ప్రభాకర్ వారిని కొనియాడారు ఇట్టి కార్యక్రమంలో శ్రీ అక్బర్ హుస్సేన్ ఈద్గా కమిటీ అధ్యక్షులు మరియు కౌన్సిలర్లు సోమశేఖర్, ఫణి కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ టిఆర్ఎస్ నాయకులు నాగుల విజయకుమార్ లతీఫ్ నసీరుద్దీన్ శ్రీహరి,హాజీ, చింత సాయినాథ్, మోబిన్ తదితరులు పాల్గొన్నారు

# జర్నలిజంపై వారి గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదు

**జర్నలిస్టు సహదేవ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలి**

**తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు గౌడ్ డిమాండ్**



మహబూబాబాద్/ మే 10 (జర్నలిస్ట్ ఫైల్) : జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌పై వ్యక్తిగత దూషణలు చేయడాన్ని వార్తలు రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మే 5న కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వీరన్న ప్రత్యేక పూజల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశమైంది . ఈ నేపథ్యంలో ప్రజల్లో వ్యక్తమైన అనుమానాలు, రాజకీయ విశ్లేషణలను ఆధారంగా చేసుకొని “ఒక పత్రిక”లో కథనం ప్రచురించడం జరిగింది. ఆ వార్తను వక్రీకరించి జర్నలిస్టు సహదేవ్ పై డబ్బులు డిమాండ్ చేశారంటు సోషల్ మీడియాలో ఆరోపణలు చేయడం అనైతికమని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వార్త రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం, వ్యక్తిగతంగా దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికార అహంకారంతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడం జర్నలిస్టుల బాధ్యత అని, వార్తలపై స్పందించాల్సింది పోయి వ్యక్తిగత ఆరోపణలు చేయడం అనైతికమని పేర్కొన్నారు. అధికారం ఉందని ఇష్టానుసారం ప్రవర్తించడం, మీడియాపై ఒత్తిళ్లు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. జర్నలిస్టుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సమాజం సహించదని ఇతర జర్నలిస్ట్ సభ్యులు హెచ్చరించారు. ఈ వ్యవహారంలో డాక్టర్ వీరన్న వెంటనే జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అలాగే జర్నలిస్టు సమాజానికి కూడా క్షమాపణలు తెలపాలని జిల్లా ప్రెస్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, దాని స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎందుకు ప్రతి జర్నలిస్ట్, ప్రెసెంట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆయనకు సపోర్ట్ గా ఉంటామని శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

# - జిల్లాలో లాడ్జిలను నడిపించే యాజమాన్యాలు నిబంధనలను కచ్చితంగా పాటించాలి

**- కొత్తగూడెం ఐఎంఏ ఫంక్షన్ హాలులో జిల్లాలోని లాడ్జిల యజమానులకు అవగాహనా సదస్సును ఏర్పాటు చేసి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




కొత్తగూడెం, మే 10(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో లాడ్జిలను నడిపించే యజమానులు నేరచేదనలో,నేరాలను నియంత్రించడంలో పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో లాడ్జిల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎస్పీ వారికి పలు సూచనలను చేశారు. లాడ్జిలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ఖచ్చితమైన నియమ నిబంధనలను పాటిస్తూ సామాజిక బాధ్యతను కలిగి ఉండి పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా లాడ్జీ యాజమాన్యాలకు పలు సూచనలను చేశారు.

**- లాడ్జిల యాజమాన్యాలు పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు**

ప్రతి అతిథి నుండి ఖచ్చితంగా ప్రభుత్వం జారీ చేసిన ఏదో ఒక గుర్తింపు కార్డు (ఆధార్, ఓటర్ ఐడి, పాస్పోర్ట్ అండ్ డ్రైవింగ్ లైసెన్స్) తీసుకోవాలి.లాడ్జీలో చేరే వారి పేరు,పూర్తి చిరునామా,ఫోన్ నంబర్,వచ్చిన సమయం మరియు వెళ్ళే సమయాన్ని రిజిస్టర్లో స్పష్టంగా నమోదు చేయాలి. గదుల్లో ఉన్న వారిని కలపడానికి వచ్చే విజిటర్లను నేరుగా లోపలికి పంపకూడదు. రిసెప్షన్ వద్ద వారి వివరములు,ఫోన్ నంబర్ నమోదు చేసుకున్న తర్వాత పంపాలి. విదేశీయులు ఎవరైనా లాడ్జిలో స్టే చేస్తే,వారి వివరములు 24 గంటల లోపు ఆన్లైన్ ద్వారా (ఫారం – సి ) రూపంలో పోలీసులకు సమర్పించాలి.ప్రతిరోజు ఉదయం 6.00 గంటలకు రిజిస్టర్లోని సమాచారము,గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలను సంబంధిత పోలీస్ స్టేషన్లో సమర్పించాలి.ఎంట్రన్స్,రిసెప్షన్ మరియు కారిడార్, బయటవైపు రోడ్డు కనిపించే విధంగా,రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా పని చేసే స్థితిలో ఉన్న సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.వీటి ఫుటేజిని కనీసం 30 రోజుల వరకు భద్రపరచాలి. అనుమానాస్పదంగా అనిపించే లగేజిని తనిఖీ చేయాలి.అధిక మొత్తంలో బ్యాగులు లేదా అనుమానిత వస్తువులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నా లేదా తప్పుడు వివరాలు ఇస్తున్నారని అనిపించినా,లాడ్జి గదుల్లో మద్యం సేవించడం, జూదం ఆడటం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా. అపరిచిత వ్యక్తులు గ్రూపులుగా వచ్చి బస చేసినా వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కి లేదా డయల్ 100కు సమాచారం అందించాలి.స్థానిక పోలీస్ స్టేషన్, ఎస్ హెచ్ ఓ నంబర్లను ఎల్లప్పుడూ రిసెప్షన్ వద్ద అందుబాటులో ఉంచుకోవాలి. పోలీసులు ఎవరైనా నిందితుల కోసం గాలిస్తున్నపుడు, వారికి సహకరించాలి. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి మరియు మంటను అదుపు చేసే వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలి.అత్యవసర ఎగ్జిట్ ను కలిగి ఉండాలి. రిసెప్షన్ డెస్క్ క్రింద అత్యవసర అలారం ఏర్పాటుచేసుకోవాలి.ఏదైనా ప్రమాదం లేదా గొడవ జరిగినప్పుడు దాన్ని నొక్కితే వెంటనే అలారం మోగేలా లేదా దగ్గరలోని పోలీస్ స్టేషనుకు సమాచారం వెళ్ళేలా ఉండాలి. సిబ్బంది యొక్క వివరములు,వారి పూర్వాపరాలను పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవడం మంచిది. లాడ్జిలో సెక్యూరిటీ గార్డులను నియమించుకుంటే,వారు గుర్తింపు పొందిన ఏదైనా సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన వారై ఉండాలి.వారి వెరిఫికేషన్ తప్పనిసరిగా చేసి ఉండాలి.ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే,చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా,లాడ్జి లైసెన్సు రద్దు చేయబడుతుంది.



# మహిళలకు ప్రత్యేకంగా డ్రెస్ చేంజ్ కొరకు మున్నేరు ఒడ్డున గది ఏర్పాటు చేయడం అభినందనీయం

**ఏదులాపురం మున్సిపల్ చైర్పర్సన్ పొకబత్తిని అనిత**



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం మున్నేరు ఒడ్డున గురుదక్షిణ ఫౌండేషన్ సమీపంలో మున్నేరు లో ఈతకు వచ్చే మహిళలకు ప్రత్యేకంగా డ్రెస్ చేంజ్ చేసుకోవడానికి ఏర్పాటుచేసిన గదిని ఏదులాపురం మున్సిపల్ చైర్పర్సన్ పోకబత్తిని అనిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం లో మున్నేరు ఒడ్డున ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఈత కొట్టడానికి, నేర్చుకోవడానికి వచ్చే మహిళల కొరకు ప్రత్యేకంగా బట్టలు మార్చుకోవడానికి గది ఏర్పాటు అభినందనీయమని మున్నేరు స్విమ్మింగ్ అసోసియేషన్ చేపట్టిన ఈ కార్యక్రమం ఎందరికో ఆదర్శప్రాయంగా నిలవనున్నదని కొనియాడారు. ప్రభుత్వం నుండి,ఏదులాపురం మున్సిపాలిటీ నుండి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని అనిత మున్నేరు స్విమ్మింగ్ అసోసియేషన్ వారికి హామీనిచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు కోదాటి గిరి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం సాయంత్రం సుమారు నాలుగు వందల మంది పురుషులు, మహిళలు ఈత కొట్టడానికి, నేర్చుకోవడానికి ఈ ప్రాంతానికి వస్తారని గురుదక్షిణ గేట్ నుండి మున్నేరు ఒడ్డు వరకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించి వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని మున్సిపల్ చైర్పర్సన్ అనిత కు విజ్ఞప్తి చేసారు. ఏ వయస్సు వారికైనా తమ అసోసియేషన్ తరపున ఉచితంగా ఈత నేర్పిస్తామని,ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.త్వరలో తమ అసోసియేషన్ తరపున మంత్రి వర్యులు పొంగులేటి, తుమ్మలను కలిసి రిటైనింగ్ వాల్ పూర్తి అయ్యే సందర్భంలో వాల్ కు ఇరువైపులా మెట్లు నిర్మించాలని,ఈ ప్రాంతాన్ని శాశ్వత స్విమ్మింగ్ హబ్ గా మార్చాలని, ఓపెన్ జిమ్,థీమ్ పార్క్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్, కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఒకటో వార్డు కౌన్సిలర్ చింతమళ్ళ రవీందర్, మూడో వార్డు కౌన్సిలర్ కొమరగిరి సత్యావతి, రెండో వార్డు, మూడో వార్డు నాయకులు ఏనుగు మహేష్,కొమరగి సుమన్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సిరిపురపు బుజ్జి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొనకంచి వీరభద్రం, బాధ్యులు బొక్కా రాంరెడ్డి, కొల్లు మాధవరావు,ఏపూరి దామోదర్, తూము శ్రీనివాస్ రావు, షేక్ జానీమియా, మాజీ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు,ఆవుల కృష్ణమోహన్, యడ్లపల్లి రమేష్, సీతారాములు, జానీ,సక్రూ నాయక్, ఏలూరి కోటేశ్వరరావు, రాగం కొండల్ రావు, కృష్ణార్జున్ రావు, దయాకర్ రెడ్డి, గణేష్,నీలిమా,ప్రియా, విజయలక్ష్మి,రచన తదితరులు పాల్గొన్నారు.



# సిఎం ఆర్ సహాయ నిధి చెక్కలను పంపిణీ చేసిన తాత మధుసూదన్



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ప్రత్యేక చొరవతో మంజూరైన మొత్తం రూ 20,62,000 విలువైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఇతర ముఖ్య నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ఖమ్మం జిల్లా ప్రజలకు కొంతమేరకైనా ప్రయోజనకరంగా ఉండాలని ఆకాంక్షతో అండగా నిలుస్తూ, సహాయ సహకారాలు అందించడంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వేదికగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఎల్లప్పుడూ ముందుంటున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సీఎం సహాయ నిధి ద్వారా లక్షలాది రూపాయల చెక్కులు నిరుపేదలకు అందించబడినట్లు తెలిపారు. ప్రతినెల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ పండగ కోలాహలంగా జరిగేదని గుర్తు చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంత ఖర్చు అయినా, ఎంత పెద్ద జబ్బు అయినా కేవలం రూ.40 వేలకే పరిమితం చేస్తుండటంతో అనేక మంది నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం కనిపించలేదని అన్నారు. నిరుపేదలకు నిజమైన మేలు జరగాలంటే మళ్లీ తెలంగాణలో కేసీఆర్ నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను అందుకున్న ప్రతి లబ్ధిదారుని పేరుపేరునా ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, పొట్ల ప్రసాద్, మహమ్మద్ రఫీ, పేరం వెంకటేశ్వర్లు, బలుసు మురళీకృష్ణ, లింగనబోయిన సతీష్, లెనిన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## - కొత్త ఆధ్వర్యంలో పసుమర్తి కి ఘన సన్మానం



ఖమ్మం, మే 10(జర్నలిస్ట్ ఫైల్) : పసుమర్తి రామ్మోహన్రావు కార్పొరేటర్ గా ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శనివారం బిఆర్ ఎస్ నాయకులు కొత్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో గల 36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు కార్పొరేటర్ గా ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సన్మాన కార్యక్రమం ప్రముఖ న్యాయవాది బిఆర్ఎస్ నాయకులు కొత్త వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం పూలదండలు వేసి శాలువా కప్పి ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పసుమర్తి రామ్మోహనరావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు ఖస్వీకరించాలని అదేవిధంగా వచ్చే కార్పొరేషన్ ఎలక్షన్ లో అత్యధిక మెజార్టీతో 36 డివిజన్లో గెలవాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ప్రజలతో నిత్యం సంబంధాలు ఏర్పరచుకొని ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నిత్యం 36 డివిజన్ ని అంటిపెట్టుకొని ఉంటూ ప్రజా సమస్యలు తీర్చడంలో అతనికి అతనే సాటి అని నిరూపించుకున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు గుంటుపల్లి దివాకర్ గుప్తా, బచ్చు మురళీకృష్ణ, కురువెల్ల లక్ష్మి కాంతారావు, ఆత్మకూరి వెంకటరావు, గుర్రం గణపతి రావు, ఓరుగంటి వెంకటేష్ బాబు, కనకం భద్రయ్య చంద్ర , గంగుల చందు అడ్వకేట్, తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ ఆఫీసర్ నుంచి డిప్యూటీ సీఈఓగా శైలజా రెడ్డి ఎదుగుదల

డిప్యూటీ సీఈఓ హోదాలో శైలజా రెడ్డి సేవలు




మహేశ్వరం ఎంపీడీవో శైలజ రెడ్డి కీలక బాధ్యతలు

మే 10 (జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం ఎంపీడీవో శైలజ రెడ్డికి పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం హైదరాబాద్‌లో ఈజీఎంఎం (జు+వీవీ) ఈజీ ఎంఎం ఫైనాన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శైలజా రెడ్డి డిప్యూటీ సీఈఓగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా సహచర అధికారులు,సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఆర్థిక పరిపాలనలో సమర్థవంతమైన సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ పదోన్నతి లభించినట్లు అధికారులు పేర్కొన్నారు.కొత్త బాధ్యతల్లో కూడా సమర్థంగా పనిచేసి శాఖ అభివృద్ధికి కృషి చేస్తానని శైలజా రెడ్డి తెలిపారు

## అక్రమ క్రషర్ మిల్లును సీజ్ చేయాలి

చింతపల్లి గ్రామ శివారులో పర్యటించిన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి




మహబూబాబాద్ మే 10 (జర్నలిస్ట్ ఫైల్) : మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం చింతపల్లి గ్రామ శివారులో దశాబ్దాలుగా సాగుతున్న అక్రమ క్రషర్ మిల్లు ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, వెంటనే దానిని సీజ్ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక గ్రామాల బాధితులతో కలిసి క్రషర్ కంకర మిల్లును సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రషర్ నిర్వాహకులు అధికారుల నుండి కేవలం రెండు ఎకరాల వరకు మాత్రమే అనుమతి పొంది, నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ పనులు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో భారీ శబ్దాలతో బ్లాస్టింగ్ చేయడం వల్ల కూతవేటు దూరంలో ఉన్న చింతపల్లి, కొత్తూరు, సి. కందికొండ స్టేజీ గ్రామాల్లోని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పగులుతున్న ఇండ్ల స్లాబ్‌లు:బ్లాస్టింగ్ ధాటికి గ్రామాల్లోని నివాస గృహాలు కంపించిపోతున్నాయని, ఇండ్ల స్లాబ్‌లు పగిలిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించిన ఆయన, బాధితుల గోడును అడిగి తెలుసుకున్నారు.



"దశలవారీగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నా, ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక మర్మమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా సాగుతున్న ఈ దందాను అరికట్టాలని, ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హంక్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభించిన మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం మే 10 : మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధి బడంగ్‌పేట్ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హంక్ ఫిట్‌నెస్ సెంటర్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజువారీ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. వ్యాయామం వల్ల శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఉల్లాసంగా ఉంటామని తెలిపారు.చిన్న వయసులోనే గుండెపోటు వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.బడంగ్‌పేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హంక్ ఫిట్‌నెస్ సెంటర్‌ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నేటి సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానానికి వ్యాయామం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ,నిరుడు శ్రీరాములు,పగడాల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
# మూడు నెలల్లోపే దరఖాస్తుల కొలిక్కి

- క్లస్టర్ల వారీగా సమస్యల సేకరణ.. అక్కడికక్కడే పరిష్కారానికి ప్రాధాన్యత- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు- తిరుమలాయపాలెం క్లస్టర్ ప్రజా దర్బార్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




ఖమ్మం, తిరుమలాయపాలెం, మే 10 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు. తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

### - మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్లు

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

### - ధరణి చిక్కుముడులకు 'భూ భారతి'

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### - ధాన్యం కొనుగోళ్లపై భరోసా

రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి.విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి.. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు




మహబూబాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు. కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనలు ఆదేశాల మేరకు సంబంధిత అంశాలపై పకడ్బందీగా ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఈ ఈ అరుణ్ కుమార్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, సిపిఓ శ్రీనివాసరావు,డి.ఎస్ఓ రమేష్, డి ఎం సప్లై సివిల్ సప్లై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొప్పుల అశోక్ నియామకం

-- ప్రజాసేవకు దక్కిన గౌరవం



తిరుమలాయపాలెం మే 10 (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ పార్టీ తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడిగా కొప్పుల అశోక్ నియమితులవడం మండల ప్రజలకు గర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా అశోక్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొంటున్నారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడుతున్నారు. ప్రజా సేవలో చూపిన నిబద్ధత, పార్టీ పట్ల ఉన్న అంకితభావం కారణంగానే పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతను అప్పగించిందని అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల అశోక్‌కు మండల ప్రజలు, పార్టీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు మరింత సేవ అందిస్తానని కొప్పుల అశోక్ ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రతి దరఖాస్తు మూడు నెలల లోపు పరిష్కారం అయ్యేలా కార్యాచరణ

: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి- ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం- ప్రతి గ్రామంలోని ధాన్యం, మొక్కజొన్న మద్దతు ధరతో పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం- ధరణి సమస్యల పరిష్కారానికే భూ భారతినీ తీసుకొచ్చాం -- తిరుమలాయపాలెం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి



తిరుమలాయపాలెం, మే 10 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా దర్బార్ కార్యక్రమంలో నమోదయ్యే ప్రతి దరఖాస్తు మూడు నెలల లోపు పరిష్కారం అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం తిరుమలాయపాలెం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే ప్రజల వద్దకు అధికారులను పంపించి ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం పేరుతో ముఖ్య శాఖల ద్వారా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజాదర్బార్ లో వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ పరిధిలో 10 నుంచి 15 గ్రామాలను చేర్చి ప్రజా సమస్యలపై దరఖాస్తులను స్వయంగాస్వీకరిస్తున్నామని తెలిపారు. అక్కడికక్కడే పరిష్కరించగల దరఖాస్తులను స్పాట్‌లోనే పరిష్కరిస్తూ, మరికొన్ని దరఖాస్తులను వారం రోజుల్లో, ఇంకొన్నింటిని నెల రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. ప్రతి దరఖాస్తు మూడు నెలల్లోపు పరిష్కారమయ్యేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.పాలేరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాలలో 14,700 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో అధికంగా ఇందిరమ్మ ఇండ్లు, భూ సమస్యలు, ఫించన్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యానికి సంబంధించిన దరఖాస్తులే ఉన్నాయని తెలిపారు. గత పదేళ్ల పాలనలో పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచే ఇండ్లు ఇవ్వాలనే ఆలోచన కూడా గత ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు, ఇండ్ల నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం లబ్ధిదారుల మహిళల బ్యాంకు ఖాతాల్లో ఎటువంటి పైరవీలు లేకుండా నేరుగా నిధులు జమ అయ్యేలా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. సొంతింటి కల నెరవేరుతుందనే నమ్మకం ప్రజల్లో పెరిగిందని, అందువల్ల ఇందిరమ్మ ఇండ్ల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం మే నెలాఖరు నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ధరణి వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒకే సర్వే నంబర్‌లో కొంత భూమిని వివిధ ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసినా, మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం వంటి అనేక సమస్యలు తలెత్తాయని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికే భూ భారతినీ తీసుకొచ్చామని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు భరోసా కలిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద కుటుంబా లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, అర్హులైన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ, గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జీల పెంపు వంటి కార్యక్రమాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. రైతును రాజుగా నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం 25 లక్షల మంది రైతులకు 2 లక్షల లోపు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. గత పాలకులు వరి వేస్తే ఉరి వేసుకున్నట్లేనని రైతులను భయపెట్టారని, కానీ తమ ప్రభుత్వం రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు అదనంగా 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని అన్నారు. రైతు భరోసా క్రింద ఎకరానికి 12 వేలు పంట సహాయం అందిస్తున్నామని, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా కల్పించారు. గతంలో పంట కొనుగోళ్లు చేయని ప్రతిపక్ష నాయకులు నేడు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ప్రసంగాలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేసింది గత ప్రభుత్వమనే విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అధికారులను ప్రజల మధ్యకు తీసుకువచ్చి సమస్యలను నేరుగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యల పరిష్కారంపై నివేదికలు కూడా సమర్పిస్తున్నామని చెప్పారు.లబ్ధిదారులు సుకన్య, ప్రియాంక లు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లుల చెల్లింపులు పూర్తవుతున్నాయని, ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు కాలేదని, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ మల్లిక మహిళా సంఘానికి 63 వేల వడ్డీ సొమ్ము జమ చేసినట్లు తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఎంతో ఉపయోగపడుతున్నా యనీ ప్రియాంక తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ఇవిధ గ్రామల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు....

## గ్రామాభివృద్ధిలో ఏపీకి జాతీయ స్థాయిలో గుర్తింపు



- ఎన్‌డీఏ ప్రభుత్వ కృషికి నిదర్శనం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కృషికి జాతీయ స్థాయిలో మరో గొప్ప గుర్తింపు లభించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్--2025, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ పురస్కార్-2025 అవార్డుల్లో దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో స్థానం దక్కడం ప్రతి ఆంధ్రప్రదేశ్ వాసికి గర్వకారణమని అన్నారు.

గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ గ్రామాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం దేశ గ్రామీణాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసిందని కొనియాడారు.

రాష్ట్ర అభివృద్ధికి దూరదృష్టితో నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, పంచాయతీరాజ్ శాఖను సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పీవీఎన్ మాధవ్ అభినందనలు తెలిపారు. అవార్డులు సాధించిన శృంగవరం, బొక్కసంపాలెం, చెముళ్లపల్లి, గుండమాల గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, గ్రామ ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## సింగపూర్ బయలుదేరిన లోకేష్

- నేడు సాయంత్రం ఢిల్లీకి రాక
- రేపు అస్సాం సీఎం ప్రమాణస్వీకారానికి హాజరు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోదీతో తేనీటి విందు అనంతరం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ బయలుదేరారు. నేడు సింగపూర్ లో జరగనున్న వివిధ సమావేశాల్లో పాల్గొంటారు. సాయంత్రం ఢిల్లీ చేరుకుంటారు. గౌహతిలో మంగళవారం జరగనున్న అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవ్వాలని స్వయంగా హిమంత బిశ్వశర్మ నారా లోకేష్ ను ఆహ్వానించారు.

## గర్భం దాల్చిన బాలికకు అధిక మోతాదులో మాత్రలు.. తీవ్ర అస్వస్థత.

- సుమోటోగా కేసు తీసుకున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో చర్చి పాస్టర్ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. చర్చి పాస్టర్ చౌటపల్లి రాంబాబు, పరిచయాన్ని ఆసరాగా చేసుకుని మైనర్ బాలికపై గత కొన్ని నెలలుగా లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, బాధిత బాలిక కుటుంబానికి పాస్టర్ తరచూ రాకపోకలు ఉండేవి. ఈ పరిచయాన్ని దుర్వినియోగం చేసుకుని బాలికను బెదిరింపులకు గురిచేస్తూ లైంగిక దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆమె గర్భవతి అయిన విషయం బయటపడింది. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

అయితే విషయం బయటకు రాకుండా చేయాలని ప్రయత్నించిన పాస్టర్, బాలికకు మోతాదుకు మించి గర్భస్రావ మాత్రలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాత్రలు మింగిన అనంతరం బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను తెలుసుక్కున్నట్లు సమాచారం.

ఈ ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఘటనను సుమోటోగా స్వీకరించిన కమిషన్ చైర్పర్సన్ వేటుకూరి. సూర్యనారాయణ రాజు , సభ్యులు జిల్లా ఇంచార్జి ఉండవల్లి గాంధీ బాబు సోమవారం కళ్లచెరువు గ్రామాన్ని సందర్శించనున్నారు. బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితి, పోలీసుల దర్యాప్తు పురోగతి, అధికారుల చర్యలపై సమగ్ర నివేదిక తీసుకోనున్నారు. అలాగే బాలికకు అవసరమైన వైద్య, న్యాయ సహాయం అందించాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# మాతృమూర్తుల సేవకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి వందనం

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 720 మంది మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులకు మెగా మెడికల్ క్యాంప్, చీరల పంపిణీ, ఉత్తమ కార్మికుల సన్మానం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- "అమ్మ లేని ఇల్లు ఎలా ఉంటుందో... శానిటరీ వర్కర్లు లేని వీధి కూడా అలానే ఉంటుంది" : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికుల కోసం వికాస్ హాస్పిటల్, శ్రీ భ్రమర ట్రస్ట్ సౌజన్యంతో గుంటూరులోని పోలీస్ కళ్యాణ మండపంలో ఆదివారం మెగా మెడికల్ క్యాంప్, ఉత్తమ పారిశుధ్య కార్మికుల సన్మానం, చీరల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 720 మంది మహిళా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరికీ చీరలను బహుమతిగా అందజేశారు. వివిధ డివిజన్లలో ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా సన్మానించారు.

వేదిక పై ముఖ్య అతిథులతో పాటు ఉత్తమ పారిశుధ్య కార్మికురాళ్ళను కూర్చోబెట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ సమాజ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని, "గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమైన స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని కార్యరూపంలో తీసుకువెళ్తున్న నిజమైన సైనికులు శానిటరీ వర్కర్లే" అని పేర్కొన్నారు.

"అమ్మ లేని ఇల్లు ఎలా అస్తవ్యస్తంగా ఉంటుందో, శానిటరీ వర్కర్లు లేని వీధి కూడా అలాగే ఉంటుంది. ఇంట్లో అమ్మ ఎంత ముఖ్యమో సమాజంలో పారిశుధ్య కార్మికులు అంతే ముఖ్యమైన వారు" అని ఎమ్మెల్యే భావోద్వేగంగా పేర్కొన్నారు.

మహిళలు ప్రపంచంలోని ప్రతి విషయంపై శ్రద్ధ పెడతారని, కానీ తమ ఆరోగ్యం విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తారని పేర్కొంటూ, మహిళా పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగానే ఈ మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వికాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో వ్యాస్కులర్ సర్జరీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, నెఫ్రాలజీ, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాలకు చెందిన ఆరుగురు నిపుణులైన వైద్యులు పాల్గొని మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.

ఈ సందర్భంగా వికాస్ హాస్పిటల్స్ ఎండీ గళ్ళ రామచంద్రరావు, సీఈఓలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా కార్మికులకు చీరలు, అల్పాహారం ఏర్పాటు చేసిన శ్రీ భ్రమర ట్రస్ట్‌కు కూడా ధన్యవాదాలు తెలిపారు.

గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ మాతృదినోత్సవం సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికుల కోసం ఇంత పెద్ద స్థాయిలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ మహిళా కార్మికులను గౌరవిస్తూ మెడికల్ క్యాంప్, చీరల పంపిణీ నిర్వహించడం గొప్ప కార్యక్రమమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముందుంటున్నారని అభినందించారు.

కనపర్తి శ్రీనివాసరావు, తాళ్ళ వెంకటేష్ యాదవ్, సింహాద్రి కనకాచారి మాట్లాడుతూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రశంసించారు. మహిళా పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి ఘనంగా సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ "ప్రతిరోజూ ప్రజల కోసం పనిచేస్తున్న మమ్మల్ని గుర్తించి ప్రత్యేకంగా మాతృదినోత్సవ వేడుక నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. మా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం, చీరలు అందించడం, సన్మానం చేయడం ఎప్పటికీ మర్చిపోలేం. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మమ్మల్ని కుటుంబ సభ్యుల్లా భావించి గౌరవించడం ఎంతో సంతోషంగా ఉంది" అని భావోద్వేగంగా తెలిపారు. తమ కోసం టాయిలెట్ లు నిర్మించాలని కార్మికులు కోరడంతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేస్తున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తితో తాను 2లక్షలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా అందజేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలలు కంటున్న పేదరికం లేని సమాజం కోసం దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉల్లాస్ అక్షర ఆంధ్రా లక్ష్యం 77,501

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో.(జర్నలిస్ట్ ఫైల్) :** అక్షరాంధ్ర ఉల్లాస్ కార్యక్రమంలో ఈ ఏడాది లక్ష్యం 77,501 అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. 2026 – 27 సంవత్సరంలో ఉల్లాస్ అక్షర ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని అన్నారు. 2029 నాటికి రాష్ట్రంలోని వయోజనులను శత శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 25 లక్షల మందిని అక్షరాస్యులుగా చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా వంద గంటల కరిక్యులం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఇందులో ఆడియో విజువల్ కంటెంట్, తరగతి గదులు, ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు. తరగతులను సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రతిరోజు స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించుటకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎప్పటిలాగానే ప్రాథమిక పాఠ్యాంశాలు, సాధన పత్రాలు పంపిణీ జరుగుతుందన్నారు. 48 రకాల డిజిటల్ వీడియోలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఫౌండేషన్ లెటర్స్ అండ్ న్యూమరసి కోర్స్ (ఎఫ్.ఎల్.ఎన్.సి)ను నైపుణ్యం పెంచడం లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాలు, శ్రామిక సంఘాలను ముఖ్యంగా ఇందులో భాగస్వామ్యం చేయడం జరుగుతుందని, డి.ఆర్.డి.ఏ, మెప్మా, ఎస్.జి.ఎస్.డబ్ల్యూ, పంచాయతీరాజ్ – గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిలో కమిటీలను పర్యవేక్షణకు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి ఇంట అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

2027 మార్చిలో గ్రామ స్థాయిలో అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ ఏడాది జూలై 21 నుండి వచ్చే ఏడాది మార్చి 15వ తేదీ వరకు తరగతుల నిర్వహణ ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల సమన్వయ సమావేశం అనంతరం జూన్ 30వ తేదీ వరకు అభ్యాసకులు, శిక్షకుల గుర్తింపు, నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. జూలై 20వ తేదీ వరకు వివిధ స్థాయిలలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. గత ఏడాది జిల్లాలో అక్షర ఆంధ్రా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా దిగ్విజయం చేయుటకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని అన్నారు.

# డ్రగ్ డిటెక్షన్ కిట్లతో విస్తృత తనిఖీలు

- గంజాయి రహిత తెనాలి లక్ష్యంగా పోలీసుల చర్యలు



**తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్) :** గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు తెనాలి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు "డ్రగ్ డిటెక్షన్ కిట్స్" ద్వారా విస్తృత తనిఖీలు చేపడుతున్నారు.

ఈ నేపథ్యంలో తెనాలి పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీ బి. జనార్ధనరావు ఆధ్వర్యంలో తెనాలి టౌన్, రూరల్ పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి తెనాలి డీఎస్పీ కార్యాలయం వద్ద అనుమానితులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ డిటెక్షన్ కిట్స్ సహాయంతో యూరిన్ నమూనాలు సేకరించి మాదక ద్రవ్యాల ఆనవాళ్ల కోసం పరీక్షలు చేపట్టారు.

అనుమానిత వ్యక్తుల జీవన విధానం, ప్రవర్తన, ఆహార్యం తదితర అంశాలపై విచారణ జరిపిన పోలీసులు, మత్తు పదార్థాల వినియోగంపై నిఘా కొనసాగిస్తున్నారు. మొత్తం 100 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, 18 మందికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్లకు పిలిపించి పర్యవేక్షణ కొనసాగిస్తామని డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు.

"సంకల్పం", "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలు, యువత, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు, కాలనీవాసులకు అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన పరిణామాలపై వివరించారు. గంజాయి కార్యకలాపాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కూడా చేయించారు.

గంజాయి రహిత తెనాలి లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో నిరంతర తనిఖీలు కొనసాగిస్తున్నామని, మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తోందని డీఎస్పీ స్పష్టం చేశారు. అనంతరం "గంజాయి వద్దు బ్రో" నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీఐలు మల్లికార్జునరావు, రాములు నాయక్, నాయబ్ రసూల్, సాంబశివరావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు లేదా డయల్ 112/100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## పిజిఆర్‌ఎస్‌కు టోల్ ఫ్రీ నంబర్ 1100

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో.(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1100 ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల పరిస్థితి తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజలు తమ దరఖాస్తులను పి.జి.ఆర్.ఎస్ తో పాటు "మీకోసం" వెబ్ సైట్ లో ఆన్ లైన్ లోను సమర్పించవచ్చని తెలిపారు. అర్జీల వివరాలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

## సోషల్ మీడియాలో విద్వేష పోస్టులు పెడితే కఠిన చర్యలు

- వదంతులు, రెచ్చగొట్టే ప్రచారాలపై గుంటూరు ఎస్పీ హెచ్చరిక

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** సోషల్ మీడియాలో మత విద్వేష పూరిత పోస్టులు, వదంతులు, రెచ్చగొట్టే సందేశాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. కడప జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే ఫోటోలు, వీడియోలు, పోస్టులు, సందేశాలను షేర్ చేయరాదని ప్రజలకు సూచించారు. సమాజంలో శాంతి, మత సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మత విద్వేషాన్ని ప్రోత్సహించే లేదా అశాంతిని సృష్టించే కంటెంట్‌ను పోస్ట్ చేయడం చట్టపరంగా శిక్షార్హమైన నేరమని ఎస్పీ స్పష్టం చేశారు. "ఒక్క పోస్టు కూడా సమాజంలో ఉద్రిక్తతలకు కారణమవుతుంది. పోస్టు చేసే ముందు దాని ప్రభావం గురించి ఆలోచించాలి" అని హెచ్చరించారు.

సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో షేర్ అవుతున్న ప్రతి సందేశాన్ని పరిశీలించాలని సూచించారు. ద్వేషపూరిత, అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే కంటెంట్ కనిపిస్తే వెంటనే తొలగించి, సంబంధిత వ్యక్తులను గ్రూపుల నుంచి తొలగించాలని తెలిపారు. ప్రతి గ్రూప్ అడ్మిన్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చట్టవిరుద్ధమైన కంటెంట్ సర్క్యులేట్ కాకుండా చూడాలని కోరారు.

తప్పుడు ప్రచారం, ఫేక్ న్యూస్, మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలు సృష్టించడం, ఫార్వార్డ్ చేయడం లేదా ప్రచారం చేయడం వంటి చర్యలపై సైబర్ క్రైమ్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు ఏమాత్రం సహించబోమన్నారు.

వదంతులను నమ్మే ముందు సంబంధిత అధికారులు లేదా విశ్వసనీయ వార్తా సంస్థల ద్వారా నిజానిజాలు ధృవీకరించుకోవాలని ప్రజలకు సూచించారు. వదంతుల వల్ల ప్రభుత్వ, ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు.

ఎవరైనా మత విద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నా, వదంతులు వ్యాప్తి చేస్తున్నా వెంటనే జిల్లా ఎస్పీ కార్యాలయం లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సోషల్ మీడియాను ప్రజా సంక్షేమం, అవగాహన, సానుకూల సందేశాల కోసం మాత్రమే బాధ్యతాయుతంగా వినియోగించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# జనాభా గణనపై అపోహలను నమ్మవద్దు

- ప్రజలకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జనాభా గణన-2027 కుసంబంధించి ఎటువంటి అపోహలను నమ్మవద్దని ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి , జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ పిలుపునిచ్చారు.

గుంటూరు జిల్లాలో జనాభా గణన కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు క్రింద తెలిపిన వివరాలు అందించారు. లిముఖ్యమైన వివరాలులి :

జనాభా లెక్కలు రెండు దశల్లో జరుగుతోంది.

మొదటి దశలో గృహ జాబితా మరియు గృహ గణన చేయడం జరుగుతోంది.

గృహ జాబితా గృహ గణన వ్యవధి మే 1 నుండి మే 30, వరకు జరుగుతుంది.

గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఫేజ్-1 ఇళ్ల గణన ప్రారంభమైంది.

ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం పూర్తిగా సురక్షితంగా, గోప్యంగా ఉంటుంది. ఈ సమాచారం ఆధారంగా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరుగుతుంది.

గృహ గణనలో ఇంటి వివరాలు, మౌలిక వసతులు టాయిలెట్స్, విద్యుత్, ట్యాప్ కనెక్షన్), గృహోపకరణాలు (టీవీ, వాహనం, సెల్ ఫోన్, ఇంటర్నెట్), ఫోన్ నంబర్ వంటి వివరాలు అడుగుతారు. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారి అధికారిక ఐడీ కార్డులను పరిశీలించాలి. ఎన్యుమరేటర్లు ఎటువంటి ఓటిపి, ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ ఖాతా, ఏటీఎం, యూపీఐ లేదా పాస్‌వర్డ్ వివరాలను అడగరు.

స్వీయ నమోదు చేసుకున్న వారు తమ నమోదు ఐడీని సిబ్బందికి తెలియజేయాలి.

జనగణన--2027 సిబ్బంది వివరాలు :

గ్రామీణ ఎన్యూమరేషన్ బ్లాకులు : 1924 ఉగాది విభజించారు.

పట్టణ ఎన్యూమరేషన్ బ్లాకులు 1882 ఉన్నాయి

మొత్తం ఎన్యూమరేషన్ బ్లాకులు : 3806 ఉన్నాయి

ఎన్యూమరేటర్లు :

మొత్తం ఎన్యూమరేటర్లు (రిజర్వ్ సిబ్బందితో కలిపి): 4046

మొత్తం సూపర్వైజర్లు : 720 ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు

సుమారు 3300 మంది సిబ్బంది ఎస్ జి ఎస్ డబ్ల్యు శాఖకు చెందినవారు. మిగిలిన సిబ్బంది వివిధ శాఖలలోని కేడర్ క్లరికల్ సిబ్బందిలో నుండి నియమించబడ్డా

జనగణన--2027 సందర్భంగా ప్రజలకు సూచనలు చేశారు

జన గణన ప్రజల సంక్షేమం, అభివృద్ధి ప్రణాళికలు, గణాంకాల సేకరణ కోసం మాత్రమే నిర్వహించడం జరుగుతోంది.

ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దు. వదంతులు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని నమ్మవద్దు. సేకరించిన సమాచారం జనగణన చట్టం ప్రకారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుంది. ఈ సమాచారం పన్నులు విధించడం, ఆస్తుల ధృవీకరణ, పోలీసు విచారణలు లేదా సంక్షేమ పథకాల రద్దు కోసం ఉపయోగించడం జరగదు. ప్రజలు, ఎన్యుమరేటర్లు ,సూపర్వైజర్లకు సహకరించి సరైన , పూర్తి సమాచారాన్ని అందించాలి. అని కోరారు. సమాచారం ఇవ్వడానికి ముందు అధికారిక గుర్తింపు కార్డును తప్పక పరిశీలించాలి. బ్యాంకు ఖాతా, ఓటిపి లు, పాస్‌వర్డ్‌లు లేదా ఇతర ఆర్థిక వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అడగడం జరగదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దు.

అనధికార వ్యక్తులకు ఎటువంటి వివరాలు ఇవ్వవద్దు.

సరైన గృహ గణన,జనాభా గణాంకాలు ప్రభుత్వం విద్య, వైద్యం, గృహాలు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయి.

గుంటూరు జిల్లా ప్రజలందరూ ఈ గృహ గణన కార్యక్రమంలో భాగస్వామ్యులై, సరైన సమాచారం అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## పవన్‌ను కలిసిన ప్రధాని..

### ఆరోగ్యం ఎలా ఉందంటూ పరామర్శ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కొద్ది రోజుల క్రితం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. డాక్టర్ల సూచనలతో ప్రస్తుతం హైదరాబాద్ నివాసంలో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ప్రధాని మోడీ పవన్ కల్యాణ్ ను పరామర్శించారు. హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో నగరానికి వచ్చిన నేపథ్యంలో పవన్ కల్యాణ్ నివాసానికి ప్రధాని మోడీ వెళ్లారు. పవన్‌ను కలిసి ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనాలని పవన్ కల్యాణ్‌కు మోడీ తెలిపారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని సీఎం చంద్రబాబు నాయుడు నివాసానికి బయల్దేరి వెళ్లారు. అయితే పవన్ కల్యాణ్–మోడీ భేటీ చారిత్రాత్మకమని జనసేన నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు

- కేంద్ర మంత్రులతో భేటీ కానున్న సీఎం
- సీఐఐ బిజినెస్ సమ్మిట్ కు హాజరు కానున్న ముఖ్యమంత్రి

అమరావతి, మే 10: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీలో పర్యటించనున్నారు. నేడు ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లనున్న సీఎం ఉదయం 11.30 గంటలకు హోం మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తోనూ ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, నిధులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రపంచబ్యాంకు ప్రతినిధులు సీఎంతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్ లో భారత పరిశ్రమల సమాఖ్య బిజినెస్ సమ్మిట్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ సహా నీతిఆయోగ్ సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రేపు రాత్రికి ఢిల్లీలోనే సీఎం బస చేయనున్నారు.

## శ్యామలానగర్ పార్క్ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం - ఎమ్మెల్యే గళ్ళా మాధవి




- పార్క్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :**గుంటూరు శ్యామలానగర్ పార్క్ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు శ్యామలానగర్ పార్క్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ శ్యామలానగర్ గుంటూరులో ప్రశాంతమైన, సురక్షితమైన ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. సమాజంలో సమస్యలు సహజమని, వాటిపై విమర్శలు కాకుండా పరిష్కార దిశగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఒకరి వల్ల కాకుండా సమిష్టికృషితోనే మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన పార్క్ కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేస్తే పార్క్‌తో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్కులు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే సామూహిక ప్రదేశాలని పేర్కొన్న ఎమ్మెల్యే, శ్యామలానగర్ పార్క్ అభివృద్ధికి ఇప్పటికే అధికారులతో చర్చలు జరిపి ప్రాధాన్యత జాబితాలో చేర్చినట్లు తెలిపారు. కమిషనర్ సహకారంతో పార్క్ అభివృద్ధి పనులు ముందుకు సాగనున్నాయని చెప్పారు.

శ్యామల నగర్ ప్రాంత ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరిన ఎమ్మెల్యే, మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. కొత్త కమిటీ శ్యామలానగర్‌ను ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

## ఉచిత ఆన్‌లైన్ ఉర్దూ కోచింగ్ తరగతులకు ఆహ్వానం



- మే 11 నుంచి 30 రోజుల పాటు శిక్షణ

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఉర్దూ భాషను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు, యువత మరియు ఆసక్తి గల వారికోసం ఉచిత 30 రోజుల ప్రాథమిక ఉర్దూ కోచింగ్ తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు షేక్ నాగూర్‌వలి తెలిపారు. ఈ ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమం మే 11వ తేదీ నుంచి ప్రారంభమై 30 రోజుల పాటు కొనసాగనుంది.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు రెండవ భాషగా ఉర్దూను ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కోచింగ్ ద్వారా ఉర్దూ భాషలో చదవడం, రాయడం, మాట్లాడడం వంటి ప్రాథమిక అంశాలను సులభంగా బోధించనున్నట్లు తెలిపారు.

ఉర్దూ భాష భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిందని, ఈ భాషను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు విద్యా, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో ఉర్దూను అభ్యసించడం ద్వారా మాతృభాష పరిరక్షణతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలలో కూడా ముందంజలో నిలవవచ్చన్నారు.

ఆసక్తి గల వారు వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు షేక్ నాగూర్‌వలి సెల్ నంబర్ 9885139827ను సంప్రదించాలని సూచించారు.

# నిస్వార్థ కర్మయోగి మండలి వెంటకృష్ణారావు : ఎమ్మెల్సీ ఆలపాటి





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు భాషా వికాసానికి ఎనలేని సేవలు చేయడంతో పాటు, బాల్యం నుండి గాంధేయ వాదాన్ని వంటబట్టించుకుని పేదల సేవలో దివిసీమ గాంధీగా కీర్తించబడిన మండలి వెంకటకృష్ణారావు నిస్వార్థ కర్మయోగి అని, వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నివాళి అర్పించారు. శనివారం రాత్రి అతిరథ మహారథుల సమక్షంలో తెనాలి కళాక్షేత్రం వేదికగా మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సమితి సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో,రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి, పట్టణంలోని పలువురు ప్రముఖులు ,తొలుత, మండలి వెంకటకృష్ణారావు చిత్రపటం, చెంత జ్యోతి ప్రజ్వలన చేసే పుష్పాంజలి ఘటించారు. అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు

అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అతిథులు తమ ప్రసంగాల ద్వారా మండలి వెంకటకృష్ణారావు, గాంధేయవాదిగా, తెలుగు భాషా వికాసానికి, పేద కుటుంబాల ప్రయోజనాలకు పాటుపడిన విధానాన్ని ప్రస్తావిస్తూ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తుమ్మల కిషోర్ కుమార్, రామకృష్ణ లకు, మండలి వెంకటకృష్ణారావు

సేవ పురస్కారాలను అతిధుల చేతుల మీదుగా ప్రదానం జేశారు. అనంతరం అరవిందా ఆర్ట్స్,తాడేపల్లి వారి,మహా పురుషుడు మండలి, అనే నాటకం ప్రదర్శించారు. డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచనకు, గంగోత్రి సాయి దర్శకత్వ బాధ్యతలతో పాటు, మండలి వెంకటకృష్ణారావు పాత్ర ద్వారా, ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. మండలి వెంకటకృష్ణారావు విద్యార్థి జీవితం, సామాజిక రాజకీయ అంశాలతో కూడిన, నాటక ఇతివృత్తం వాస్తవం కావడం, మహా పురుషుడు మండలి నాటకానికి ఏఐ టెక్నాలజీ ఉపయోగించి, దివిసీమ ప్రాంత దృశ్యాలను కళ్లకు కట్టినట్లు చూపడంతో అద్యాంతం ప్రేక్షకులను అలరించింది. టీఎస్ రెడ్డి, డాక్టర్ సుందర్, శ్రీకాంత్ లు డిజిటల్ ఏఐ టెక్నాలజీని పర్యవేక్షించారు. అనంతరం నాటకాన్ని పూర్తిగా తిలకించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కళాకారులకు అభినందనలు తెలిపారు. బొల్లి ముంత శివరామకృష్ణ ఫౌండేషన్ బాధ్యులు, బొల్లి ముంత కృష్ణ,చందు సుబ్బారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# టీడీపీలో 150 కుటుంబాల చేరిక



- పార్టీకి కార్యకర్తలే ప్రధానం
- కార్యకర్తే టీడీపీలో అధినేత
- టీడీపీ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీ తీర్థం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- కూటమి పాలనకు ఆకర్షితులయ్యామన్న కార్యకర్తలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలంటే కేవలం సైనికులే కాదు.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఇతర పార్టీల నుంచి సుమారు 150 కుటుంబాలు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత అనే సంకేతంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కార్యక్రమం చేపట్టారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే ప్రధానమని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు సముచిత గౌరవం ఉంటుందని తెలిపారు. గత వైసీపీ పాలనతో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని సర్వనాశనం చేశారని ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. ఎక్కడా అభివృద్ధి అనే పథకం కనిపించలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని రీతిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. నంది వెలుగు బ్రిడ్జి నుంచి సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వరకు ప్రతి అంశంలోనూ సరికొత్త ప్రణాళికతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. ఇటు సంక్షేమాన్ని, అటు అభివృద్ధిని సమాన స్థాయిలో ప్రజలకు అందిస్తోన్న ఘనత కేవలం కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడుతున్నామని చెప్పారు.

అందుకే ఇతర పార్టీల నుంచి సైతం కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కార్యకర్తలే ప్రధానమన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నామని చెప్పారు. గత వైసీపీ పాలనలో ఎక్కడా అభివృద్ధి ఆనవాళ్లు కనిపించ లేదని తెలిపారు. కేవలం రెండేళ్ల కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కనిపిస్తోందని చెప్పారు.

## హెల్త్ కార్డ్‌ల ద్వారా ప్రతీకుటుంబానికి ఆరోగ్యభరోసా : మంత్రి నాదెండ్లమనోహర్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా కల్పించే విధంగా త్వరలోనే హెల్త్ కార్డ్స్ పథకం అమల్లోకి తెస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

స్థానిక బోస్ రోడ్ లోని మంత్రి నాదెండ్ల మనోహర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ అర్హత సాధించిన 13మందిలబ్ధిదారులకు మంత్రి నాదెండ్ల మనోహర్, 11లక్షల84వేల, రూపాయాల మేర, చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా, వైద్య సేవలకు అందిస్తున్న సహకారం ఆ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు తెనాలి నియోజకవర్గంలో 537 కుటుంబాలకు, ఐదు కోట్ల 54 లక్షల రూపాయల మేర సీఎం రిలీఫ్ ఫండ్ లభించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో లబ్దిదారులతొ పాటు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

## ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**మాతృ దినోత్సవం సందర్భంగా గుంటూరు పోలీస్ కళ్యాణ మండపంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి ఆధ్వర్యంలో, శ్రీ భ్రమర టౌన్‌షిప్, వికాస్ హాస్పిటల్స్ సహకారంతో పారిశుధ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంపు, చీరాల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ , గుంటూరు నగర మున్సిపల్ కమీషనర్ మయూర్ అశోక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... సమాజానికి సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రతి కుటుంబానికి తల్లి ఎంత ముఖ్యమో, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కూడా అంతే గొప్పదని పేర్కొన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి తల్లికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, తల్లి ఆశీస్సులే మన విజయాలకు నిజమైన బలమని మన్నవ అన్నారు.

# పదో తరగతిలో జిల్లా టాపర్ హారికకు అభినందనలు

- విద్యార్థిని ఇంటికి వెళ్లి సన్మానించిన ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్



**అనంతపురం, (జర్నలిస్ట్ ఫైల్):** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 592 మార్కులు సాధించి అనంతపురం జిల్లాలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థిని హారికను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ అభినందించారు. గార్లదిన్నె మండలం ముంటిమడుగు గ్రామానికి చెందిన హారిక ఇంటికి స్వయంగా వెళ్లి ఆమెను శుభాకాంక్షలు తెలియజేశారు.

గార్లదిన్నె మండలం కల్లూరు హైస్కూల్‌లో చదువుతున్న హారిక గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా హారికకు నగదు బహుమతి అందజేసి ఆమె ప్రతిభను ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని నల్లపల్లి విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో ఉద్దేహాల్ ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషయ్య, ఏపీఎస్ఈఏ నాయకులు జోషి కుమార్, టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్.ఎం. బాషా, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాతృమూర్తుల సన్మానంతో ఘనంగా మదర్స్ డే వేడుకలు

- ఏపీ ఎన్‌జీజీవో సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎన్‌జీజీవో సంఘం ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు ఆదివారం ఎన్‌జీజీవో హోంలో ఘనంగా నిర్వహించారు. మహిళా వింగ్ చైర్పర్సన్ షేక్ తాజునిసా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తల్లి గొప్పతనాన్ని కొనియాడుతూ మాతృమూర్తులకు ఘన సన్మానం నిర్వహించారు.

ఈ సందర్భంగా షేక్ తాజునిసా మాట్లాడుతూ తల్లి అనేది కేవలం ఒక వ్యక్తి కాదని, ప్రేమ, త్యాగం, భరోసా, జీవితం కలయిక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులతో సమయం గడపాలని, వారి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రేమాభిమానాలతో ఆదరించాలని సూచించారు. అలా చేసినప్పుడే మదర్స్ డే జరుపుకునే అసలు ఉద్దేశ్యం నెరవేరుతుందని తెలిపారు.

మహిళా ఉద్యోగినులు ప్రదర్శించిన “ఐ లవ్ డాటర్” భావరూపక స్కిట్ తల్లి ప్రేమ, కుటుంబ విలువలను ప్రతిబింబిస్తూ అందరినీ ఆకట్టుకుంది.

జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లి ఆశీర్వాదం దేవుని వరం కన్నా విలువైనదని, తల్లిని ప్రేమించి గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మంచి తల్లి మంచి కుటుంబాన్ని, మంచి కుటుంబం మంచి సమాజాన్ని, మంచి సమాజం మంచి దేశాన్ని నిర్మిస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో తల్లికి అత్యున్నత స్థానం ఉందని, వేదాలు, పురాణాలు తల్లి గొప్పతనాన్ని చాటిచెప్పాయని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు తమ మాతృమూర్తులను వేదికపైకి తీసుకొచ్చి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు పొందారు. మదర్స్ డే సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. పొన్నూరులోని శామ్ తోం కరుణాలయంలో 100 చీరలు పంపిణీ చేయగా, గోరంట్లలోని కార్మెల్ శరణాలయంలో 60 మందికి దుస్తులు అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి. శ్రీవాణి, విజయలక్ష్మి, అనిల్ కుమార్, జానీ భాష, కృష్ణ కిషోర్, విజయ్, నరసింహారావు, సిటీ అధ్యక్షుడు సిహెచ్ కళ్యాణ్ కుమార్, కార్యదర్శి జీవీ కోటేశ్వరావు, టీవీ శ్రీనివాసరావు, సాంబశివరావు, జిల్లా మహిళా వింగ్ కన్వీనర్ విజయలక్ష్మి, అరుణ, వాణి, నాగపావని, నారాయణమ్మ, గీతాంజలి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467